సంపుటి : 18
సంచిక : 133
Vol : 18
Issue : 133

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్




# పీపుల్స్ డైరీ


సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, మంగళవారం 21 జూలై 2026
Warangal, Tuesday 21 July 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00



WANTED

పీపుల్స్‌డైరీ

దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు

◆ హనుమకొండ ◆ కరీంనగర్ ◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం ◆ జనగామ ◆ మహబూబాబాద్ ◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్

Cell : 9493019044
9618509859


## త్రిపుర డీజీపీ ఆత్మహత్య

- సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని...
- పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోనే ఘటన
- షాక్‌కు గురైన పోలీసు వర్గాలు



**పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ :** పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోనే డీజీపీ ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. త్రిపుర డీజీపీ తన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పోలీస్ వర్గాలను షాక్‌కు గురిచేస్తోంది. ఆయన ఆత్మహత్యకు గల కారణాలు ఏంటి అనేది ఇప్పుడు మిస్టరీగా మారింది. ఇక, మూడు దశాబ్దాలకుపైగా సాగిన కెరీర్‌లో అనేక కీలక పదవులను చేపట్టిన అనురాగ్.. కేంద్రంలోనూ కీలక పదవులను చేపట్టారు. సీబీఐలో ఏడీ, జేడీలుగా ఆయన బాధ్యతలు చేపట్టారు. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన దన్ఖడ్ అగర్తలలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన తన సర్వీసు రివాల్వర్ కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను చికిత్స కోసం గోవింద్ వల్లభ పంత్ హాస్పిటల్‌కు తరలించగా.. అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. (మిగతా 2లో...)

## పులులకు మేత!

- నల్లమలకు అడవి దున్నలు..
- పులుల వేట కోసం సరికొత్త ప్లాన్!
- మధ్యప్రదేశ్ నుంచి అడవిదున్నలు తెప్పించే ఆలోచన
- గుండ్ల బ్రహ్మేశ్వరం సమీపంలో వదిలే ఛాన్స్

**పీపుల్స్‌డైరీ-అమరావతి :** నల్లమల అడవులు అన్ని రకాల జీవజాతులకు నిలయం. ఈ అడవుల్లో ఎన్నో రకాల జంతువులు నివసిస్తుంటాయి. ముఖ్యంగా పెద్ద పులులకు మన నల్లమల అడవి నిలయంగా మారింది. మార్కాపురం, నంద్యాల, పల్నాడు జిల్లాల్లో విస్తరించిన నాగార్జున సాగర్ - శ్రీశైలం అభయారణ్యంలో ఉన్న వీటికి ఇప్పుడు ఆహార సమస్య ఏర్పడింది. పులులు ఎక్కువగా వేటాడే జింకలు, దుప్పులు ఇప్పుడు నల్లమల నుంచి బయటకు వెళ్లిపోవడం పెద్ద సమస్యగా మారింది. అందుకోసమే పులులు వేట కోసం అడవి దున్నలను తెచ్చే యోచనలో అధికారులు ఉన్నారు. (మిగతా 2లో...)





## డెంగ్యూ వ్యాక్సిన్‌కు గ్రీన్‌సిగ్నల్

**టీకా అందుబాటులోకి రావడం కీలకపరిణామం**

**భారత్‌లో పెరుగుతున్న డెంగ్యూ కేసులు**

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** ఇండియాలో తీవ్రంగా వేధిస్తున్న డెంగ్యూ సమస్యకు పరిష్కారంగా డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. జపాన్‌కు చెందిన ప్రముఖ బయోఫార్మాస్యూటికల్ సంస్థ 'టకేడా' అభివృద్ధి చేసిన 'క్యూడెంగా' వ్యాక్సిన్‌కు భారత్‌లో అధికారిక ఆమోదం తెలిపింది. దీంతో దేశంలో అనుమతి పొందిన మొట్టమొదటి డెంగ్యూ టీకాగా ఇది నిలిచింది. గత రెండు దశాబ్దాలుగా ఇండియాలో డెంగ్యూ కేసులు దాదాపు 11 రెట్లు పెరిగిన నేపథ్యంలో ఈ టీకా అందుబాటులోకి రావడం అత్యంత కీలకమైన పరిణామంగా భావిస్తున్నారు.

ఈ వ్యాక్సిన్‌ను 4 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన వారు ఉపయోగించేందుకు అనుమతించారు. డెంగ్యూ వైరస్‌కు చెందిన నాలుగు రకాల ప్రధాన స్ట్రెయిన్‌ల నుంచి రక్షణ కల్పించేలా (మిగతా 2లో...)


## వంట గ్యాస్‌లో సంస్కరణల దిశగా

- 'ఇథనాల్' గ్యాస్‌తో కుకింగ్‌కు ప్లాన్?
- ఎల్‌పీజీ సిలిండర్ల ధరకు చెక్..
- కేంద్రం సంచలన ప్లాన్?

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** దేశంలో మధ్య తరగతి కుటుంబాల బడ్జెట్‌ను శాసించే వాటిలో వంట గ్యాస్ (ఎల్‌పీజీ) సిలిండర్ ధరలు ప్రధానమైనవి. అయితే, భవిష్యత్తులో ఈ ధరల భారం నుంచి సామాన్యుడికి పెద్ద ఉపశమనం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాహనాల ఇంధనంలో ఇథనాల్ కలపడం విజయవంతంగా పెంచుకుంటూ పోతున్న కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు అదే ఇథనాల్‌ను వంటగది ఇంధనంగా మార్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. దీంతో కాలుష్యం తగ్గడమే కాకుండా వంట ఖర్చులు భారీగా తగ్గుతాయని అంచనా వేస్తోంది.

ఈ మేరకు పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ప్రత్యామ్నాయ స్వచ్ఛ వంట విధానం రూపకల్పనలో నిమగ్నమైంది. (మిగతా 2లో...)







## భారత్‌కు కొలెస్ట్రాల్ కాటు

- ప్రతి 10 మందిలో 9 మందికి రక్తంలో కొవ్వు సమస్య
- ఐసీఎంఆర్ అధ్యయనంలో వెల్లడి

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** భారతీయుల ఆరోగ్యంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్-ఇండియా డయాబెటిస్ నిర్వహించిన జాతీయస్థాయి అధ్యయనంలో కొన్ని ఆందోళనకరమైన విషయాలు వెల్లడయ్యాయి. దేశంలో ప్రతి 10 మంది వయోజనుల్లో దాదాపు తొమ్మిది మంది (87.3%) ఏదో ఒక రకమైన 'డైస్లిపిడెమియా'తో బాధపడుతున్నారని ఈ సర్వే తేల్చింది. డైస్లిపిడెమియా అంటే రక్తంలో కొవ్వుల (లిపిడ్స్) నిష్పత్తి అసాధారణంగా ఉండటం. సాధారణ భాషలో చెప్పాలంటే చెడు కొలెస్ట్రాల్ లేదా ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉండటం, మంచి కొలెస్ట్రాల్ తక్కువగా ఉండటం. ఈ సమస్య గుండె జబ్బులు, గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారణమవుతుంది. ప్రఖ్యాత 'జర్నల్ ఆఫ్ క్లినికల్ లిపిడాలజీ' లో ప్రచురితమైన (మిగతా 2లో...)

## చార్‌ధామ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత

**ప్రతికూల వాతావరణమే కారణం**



**పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ :** చార్‌ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం, వాతావరణ శాఖ రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లు జారీ చేయడంతో యాత్రికుల భద్రత దృష్ట్యా ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. చార్‌ధామ్ మార్గంలో కురుస్తున్న భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడుతుండటంతోచార్ ధామ్ యాత్రను సోమవారం (జూలై 20, 2026) తాత్కాలికంగా నిలిపివేశామని అని అధికారులు తెలిపారు." ప్రతికూల వాతావరణం దృష్ట్యా ఏ యాత్రికుడిని ముందుకు వెళ్లనివ్వకుండా చూడాలని స్థానిక అధికారులను యంత్రాంగం ఆదేశించింది. కేదార్‌నాథ్, బద్రీనాథ్, యమునోత్రి, గంగోత్రిలకు వెళ్లే చార్‌ధామ్ యాత్ర ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమైన విషయం తెలిసిందే.

## సంచలన రిపోర్ట్!

- ఆడాళ్లా మజాకా...



**కొనసాగుతున్న పతులకు పైలోక ప్రాప్తి...**

**ఆరు నెలల్లో 554 మంది భర్తల మృతి!**

**322 హత్యలు.... 232 ఆత్మహత్యలు**

**పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ :** దేశవ్యాప్తంగా భర్తలపై జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలపై గురుగ్రామ్‌కు చెందిన ఏకం న్యాయ్ ఫౌండేషన్ విడుదల చేసిన తాజా నివేదిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2026 తొలి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా 554 మంది భర్తలు హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్నట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ వెల్లడించింది. అయితే ఇవి ప్రభుత్వ అధికారిక గణాంకాలు కాదని.. మీడియా కథనాలు, ఫౌండేషన్ సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటేషన్ రిపోర్టు మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం.. మొత్తం 322 మంది భర్తలు హత్యకు గురయ్యారని తెలుస్తోంది. వీరిలో అత్యధిక కేసులు భార్యలు లేదా వారి వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగిన కుట్రలతో ముడిపడి ఉన్నట్లు (మిగతా 2లో...)

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం



- నేనేం తప్పు చేయలేదంటూ వాట్సాప్ స్టేటస్
- చర్చనీయాంశంగా మారిన లైంగిక వేధింపుల వ్యవహారం

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** సంచలనంగా మారిన పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కేసులో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించారు. ఆత్మహత్యా యత్నానికి ముందు తన తప్పేమీ లేదని ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ స్టేటస్ పెట్టారు. ప్రస్తుతం ఉదయ్ కృష్ణారెడ్డి కి చికిత్స కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ మొత్తం వ్యవహారం పైన విచారణ కొనసాగు తోంది.

నేషనల్ పోలీసు అకాడమీలో తనతోపాటు శిక్షణ పొందుతున్న తోటి ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నారని ఓ ట్రైనీ ఐపీఎస్ అధికారిణి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తనను బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి ప్రైవేట్ భాగాలను తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, మెడపై కత్తి పెట్టి ఆ గది నుంచి (మిగతా 2లో...)

## హైదరాబాద్‌లో భారీ చోరీ

**కేజీ బంగారం కాజేసిన కేటుగాళ్లు..**

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** హైదరాబాద్‌లో మరో భారీ దొంగతనం కలకలం రేపింది. బంజారాహిల్స్‌లోని ఓ ఎక్స్‌పోర్ట్ కార్యాలయంలోకి చొరబడిన కొందరు దుండగులు.. సుమారు కేజీ మేర బంగారు ఆభరణాలను దోచుకెళ్లినట్టు తెలుస్తోంది. బాధితుడి ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఓ వ్యాపారి ఎక్స్‌పోర్ట్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాడు. అయితే ఆదివారం రాత్రి కిటికీని ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించిన దుండగులు.. లాకర్‌ను బద్దలు కొట్టి అందులో ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్టు నిర్వాహకుడు తెలిపారు.




మిస్సైన ఆభరణాలలో 7 నెక్లెస్‌లు, 7 జతల చెవిపోగులు కలిపి మొత్తం 1,028 గ్రాముల నగలు ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ నగలను డైమండ్ ఫిక్సింగ్ కోసం లాకర్‌లో దాచామని.. అంతలోనే దుండగులు వాటిని అపహరించుకుపోయినట్టు బాధితుడు తెలిపారు. వ్యాపారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ కెమెరా దృశ్యాల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

# భారత్‌కు కొలెస్ట్రాల్ కాటు

(మొదటి పేజీ తరువాయి)

ఈ అధ్యయనం కోసం దేశవ్యాప్తంగా 23,665 మంది నుంచి శాంపిల్స్ సేకరించి విశ్లేషించారు. కొలెస్ట్రాల్ సమస్య అనేది కొద్దిమందికి మాత్రమే పరిమితమైనది కాదని, ఇది దేశవ్యాప్తంగా సర్వసాధారణ ఆరోగ్య సమస్యగా మారిపోయిందని ఈ సర్వే ఫలితాలు స్పష్టంచేశాయి. ఈ అధ్యయనంలో మరికొన్ని కీలక విషయాలు కూడా వెల్లడయ్యాయి. ఈ అధ్యయనం ప్రకారం.. కొలెస్ట్రాల్ సమస్య కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితం కాలేదు. పట్టణాల్లో 89% మంది ఈ సమస్యతో బాధపడుతుంటే, గ్రామీణ ప్రాంతాల్లోనూ 86.5% మంది దీని బారినపడ్డారు. అంటే జీవనశైలితో సంబంధం లేకుండా ఈ ముప్పు విస్తరిస్తోందని అర్థమవుతోంది.



ఇక లింగాల వారీగా చూస్తే పురుషుల (83.5%) కంటే మహిళల్లోనే (91.1%) ఈ సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. భారతీయుల్లో అత్యంత సాధారణంగా కనిపించే సమస్య మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) తక్కువగా ఉండటమేనని, జనాభాలో 66.8% మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని నివేదిక పేర్కొన్నది. అధ్యయనంలో అత్యంత ఆందోళన కలిగించే అంశం యువతపై దీని ప్రభావం. పాశ్చాత్య దేశాల్లో 50–60 ఏళ్ల వయసులో కొలెస్ట్రాల్ సమస్యలు తీవ్రమవుతుండగా, భారతదేశంలో కేవలం 30–39 ఏళ్ల వయసులోనే ఇది గరిష్ఠ స్థాయికి చేరుకుంటోంది.

# సంచలన రిపోర్ట్!

(మొదటి పేజీ తరువాయి)

ఆ సంస్థ పేర్కొంది. మొత్తం హత్యల్లో 194 కేసులు (సుమారు 60.2 శాతం) వివాహేతర సంబంధాల కారణంగానే జరిగినట్లు ఆ రిపోర్టు వెల్లడించింది. భార్యలు, తమ ప్రియులతో కలిసి కట్టుకున్న భర్తలను హత్య చేసిన ఘటనలు ఎక్కువగా నమోదు అయ్యాయని ఆ నివేదిక తెలిపింది.

అదే సమయంలో 232 మంది భర్తలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ పేర్కొంది. వీటిలో కుటుంబ కలహాలు, గృహహింస, మానసిక వేధింపులు, తప్పుడు క్రిమినల్ కేసులు, పిల్లలను కలవనివ్వకపోవడం వంటి కారణాలు ప్రధానంగా ఉన్నాయని నివేదికలో వివరించింది. ఈ కేసుల్లో విషం పెట్టి చంపడం, గొంతు నులిమి హత్య చేయడం, విద్యుత్ షాక్ పెట్టి హతమార్చడం, సజీవదహనం చేయడం, మృతదేహాలను ముక్కలు ముక్కలుగా నరకడం, చంపేసి ప్రమాదంగా లేదా ఆత్మహత్యగా చిత్రీకరించడం వంటి అత్యంత దారుణమైన నేరాలు నమోదు అయినట్లు ఆ నివేదిక తెలిపింది.


రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా 93 హత్యలు, 103 ఆత్మహత్యలతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ రిపోర్టు తెలిపింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని పేర్కొంది. అయితే.. ఈ నివేదికపై ప్రభుత్వ అధికారిక ధృవీకరణ లేదని ఆ సంస్థ స్పష్టం చేసింది.

దేశంలో భర్తల హత్యలు లేదా పురుషులపై గృహహింసకు సంబంధించిన ప్రత్యేక జాతీయ డేటాబేస్ లేకపోవడంతో అసలు సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏకం న్యాయ్ ఫౌండేషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ సమస్య తీవ్రతను అంచనా వేయాలంటే అధికారిక గణాంకాల సేకరణ అవసరమని ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ సూచించింది.



# త్రిపుర డీజీపీ ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)



ఈ ఘటనకు దారితీసిన కచ్చితమైన పరిస్థితులు ఇంకా నిర్ధారణ కాలేదు. దీనిపై అధికారిక దర్యాప్తు ప్రారంభించారు.

అమితాబ్ రంజన్ పదవీవిరమణ తర్వాత.. అనురాగ్ ధన్ఖడ్ మే 2025లో త్రిపుర పోలీస్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకు ఆయన త్రిపుర ఇంటెలిజెన్స్ విభాం డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. అలాగే, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (జదీ×)లో కీలక బాధ్యతలు నిర్వహించారు. అనేక ఉన్నత స్థాయి దర్యాప్తులను నిర్వహించారు. రాష్ట్రంలోని అత్యంత సీనియర్ ఐపీఎస్ అధికారులలో ఒకరైన ధన్ఖడ్ ఆకస్మిక మరణం పోలీసు వర్గాలు, ప్రభుత్వ అధికారులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

# డెంగ్యూ వ్యాక్సిన్‌కు గ్రీన్‌సిగ్నల్




(మొదటి పేజీ తరువాయి)

రూపొందించబడింది. వ్యాక్సిన్ వేసుకోవడానికి ముందు ఎలాంటి రక్త పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేదు. గతంలో డెంగ్యూ సోకినా, సోకకపోయినా దీనిని వేయవచ్చు. ఈ టీకాను చర్మం కింద ఇస్తారు. ఇది ఒక్కోటి 0.5 ఎంఎల్ చొప్పున రెండు డోసుల రూపంలో వస్తుంది. ఒక్కో డోసుకు మూడు నెలల వ్యవధి ఉంటుంది. దీని ధరను ఇంకా ప్రకటించలేదు, కానీ ఏటా 50 మిలియన్ డోసుల వరకు ఉత్పత్తి చేయడానికి టకేడా సంస్థ హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్ ఇ సంస్థతో తయారీ భాగస్వామ్యం కుదుర్చుకున్నందున, భారత మార్కెట్‌కు ధరలు పోటీగా ఉంటాయని భావిస్తున్నారు. భవిష్యత్తులో దీనిని ప్రభుత్వ రోగనిరోధక కార్యక్రమాలలో చేర్చుతారా లేదా అనే దానిపై కూడా ధర ఆధారపడి ఉంటుంది.

గత రెండు దశాబ్దాలుగా భారతదేశంలో డెంగ్యూ కేసులు 11 రెట్లు పెరిగిన తరుణంలో ప్రజారోగ్యానికి ఇది ఓ కీలకమైన సమయంలో ఈ ఆమోదం లభించింది. ప్రపంచవ్యాప్త డెంగ్యూ భారంలో దాదాపు మూడింట ఒక వంతు ఇండియాలోనే కొనసాగుతోంది. డెంగ్యూ అనేది దోమల ద్వారా వ్యాపించే ఓ వైరల్ వ్యాధి, ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తుంది.

# వంట గ్యాస్‌లో సంస్కరణల దిశగా..

(మొదటి పేజీ తరువాయి)

ఈ విధానం ద్వారా ఎల్‌పీజీతో పాటుగా ఇథనాల్ సైతం వంట కోసం ప్రధాన ఇంధనంగా ప్రోత్సహించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. దీని వల్ల దేశంలో స్వచ్ఛమైన ఇంధన వినియోగం పెరగడమే కాకుండా దిగుమతి చేసుకునే ఎల్‌పీజీపై ఆధారపడడాన్ని తగ్గిస్తుందని' అని సంబంధిత వర్గాలు తెలిపాయి.



ప్రత్యామ్నాయ స్వచ్ఛ వంట గ్యాస్ పై ప్రభుత్వం వేగంగా పని చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విధానంలో భాగంగా ఎల్‌పీజీతో పాటు ఇథనాల్ సైతం ప్రధాన వంట ఇంధనంగా గుర్తిస్తారు. ప్రస్తుతం దీనిపై అంతర్గత చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి ఒక విధానాన్ని తయారు చేసి, విధి విధానాలు ఖరారు చేయవచ్చని సమాచారం. అయితే, ఈ విషయంపై కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ నుంచి ఇప్పటి వరకు అధికారిక ప్రకటన రాలేదు.

ఎల్‌పీజీకి ప్రత్యామ్నాయం భారత్ తన వంట గ్యాస్ అవసరాల కోసం అధికంగా ఇతర దేశాల దిగుమతులపైనే ఆధారపడుతోంది. దేశీయంగా చెరకు, తృణధాన్యాల నుంచి తయారయ్యే ఇథనాల్‌ను వంటకు వాడడం ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆదా అవ్వడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లో గ్యాస్ ధరలు పెరిగినా ప్రభావం పడదు. ఇథనాల్ వంటకు ఉపయోగించడానికి వీలుగా ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు, పరిశోధనా సంస్థలు ప్రత్యేకమైన ఎథనాల్ కుకింగ్ స్టవ్‌లను అభివృద్ధి చేస్తున్నాయి. ఇది సాంప్రదాయ గ్యాస్ కంటే తక్కువ ప్రమాదకరమైనదిగా, పర్యావరణహితంగా ఉంటుంది.

# పులులకు మేత!

(మొదటి పేజీ తరువాయి)

మధ్యప్రదేశ్ నుంచి అడవి దున్నలను నల్లమల అటవీ ప్రాంతానికి తీసుకొచ్చే ఆలోచనలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఉంది. తొలి దశలో డిసెంబర్ నెలకి 15 దున్నలు తీసుకురానున్నారు. మూడేళ్లలో మొత్తం 50 వరకు దున్నలు తీసుకురావాలి అనేది అధికారుల ఆలోచన. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. కేంద్ర, అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేంద్రయాదవ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌తో ఇప్పటికే ఈ విషయమై చర్చించినట్టు తెలుస్తోంది.

నల్లమలలో పచ్చిక మైదానాలు తక్కువగా ఉండటం.. ముదురు గడ్డి, పొదలే ఎక్కువగా ఉండటంతో అవి జింకలు, దుప్పులకు ఆహారంగా పనికిరావడం లేదు. దుప్పులు, జింకలు ఎక్కువగా లేత పచ్చికను మాత్రమే మేతగా తీసుకుంటాయి. దాంతో అవి నల్లమల నుంచి బయటకు వెళ్లిపోతున్నాయి. అడవి దున్నలయితే ముదురు గడ్డి పొదలను బాగా తింటాయి.

అడవి దున్నలు నల్లమలకు వస్తే ముదురు గడ్డి పొదలు తింటాయి. ఆ తర్వాత అక్కడ లేత గడ్డి



కూడా వస్తుంది అది దుప్పులు, జింకలకు ఆహారంగా మారుతుంది. దాంతో అవి నల్లమల నుంచి బయటకు వెళ్లకుండా ఇక్కడే ఉండే అవకాశం ఉంటుంది. దాంతో పులులతో పాటు ఇతర మాంసాహార జంతువులకు ఆహారం దొరుకుతుందని అటవీ అధికారుల ఆలోచన.

బ్రిటిష్ కాలంలో నల్లమలలో అడవి దున్నల సంఖ్య ఎక్కువగా ఉండేది. ఆ తర్వాత వాటికి జబ్బులు రావడం, సరైన ఆవాసాలు కూడా లేకపోవడంతో క్రమేపీ వాటి సంఖ్య తగ్గింది. ఇప్పుడు మధ్యప్రదేశ్ నుంచి వచ్చే అడవి దున్నలను గిద్దలూరు నల్లమలలో ఉన్న గుండ్ల బ్రహ్మేశ్వరం చుట్టూ నలభై కిలోమీటర్ల పరిధిలో ఉంచే అవకాశం ఉంది.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం

(మొదటి పేజీ తరువాయి)

బయటకు వెళ్లకుండా నిర్బంధించాడని ఆ అధికారిణి ఆరోపించారు. దీంతో ఉదయ్ కృష్ణారెడ్డిపై బీఎన్ఎస్‌లోని 74, 75, 77, 78, 79, 127(2), 115(2), 351(2) సెక్షన్లతోపాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని 66ఈ, 67ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



కాగా, ఈ ఘటన పైన ఉన్నతాధికారులు సీరియస్ గా స్పందించారు. వెంటనే విచారణకు ఆదేశించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మహిళా ఐపీఎస్ ట్రైనీ చేసిన ఆరోపణలు నిజమని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. దీంతో, పోలీసు అకాడమీ నుంచి ఉదయ్ కృష్ణారెడ్డిని సస్పెండ్ చేసిన విషయం తెల్సిందే. ఈ పరిణామాలతో మనస్తాపానికి గురైన ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. దీనికి ముందు తన తప్పేమీ లేదంటూ వాట్సాప్‌లో స్టేటస్ పెట్టాడు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉదయ్ కు చికిత్స అందిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి సమాచారం రాబట్టేందుకు విచారణ కొనసాగుతోంది. ఉదయ్ ఆరోగ్య పరిస్థితి పైన ఆస్పత్రి వర్గాలు బులెటిన్ విడుదల చేయనున్నాయి.

# ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు శిక్షణ





**హనుమకొండ, జూలై 20 (పీపుల్స్‌డైరీ) :** హనుమకొండ జిల్లా గవర్నమెంట్ హై స్కూల్ వడ్డేపల్లి లో జిల్లాలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంల అందరికీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ శిక్షణ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్గా సురేష్ వ్యవహరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నడికుడ మండలం నుండి అచ్చ సుదర్శన్ ప్రాథమిక పాఠశాల, చర్లపల్లి, పలీత శ్రీహరి ప్రాథమిక పాఠశాల నార్లాపూర్, రావుల రమేష్ ప్రాథమిక పాఠశాల కౌకొండ నుండి హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నాయకత్వ లక్షణాలు, ఎఫ్ ఎల్ ఎన్, బేస్ లైన్, మిడ్లైన్, ఎండ్ లైన్ గురించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలుగా వింజమూరి వేణు గోపాలస్వామి, దండ్రే రాజమౌళి, భగవాన్ రెడ్డి, వివిధ మండలాలలో పనిచేస్తున్న ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# వృద్ధుడిపై చిరుత దాడి...

- ప్రాణాలకు తెగించి తండ్రిని కాపాడిన కుమార్తె
- సాహసంతో చిరుతను గదిలో బంధించింది
- ఆపై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు

పీపుల్స్‌డైరీ–వెబ్‌డెస్క్ : ఉత్తరాఖండ్ పరిధిలోని చంపావత్ జిల్లా సిమాల్తా గ్రామంలో శుక్రవారం రాత్రి ఒళ్లు గగుర్పొడిచే ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన 64 ఏళ్ల లక్ష్మీ దత్ పాండే.. అనే వృద్ధుడు శుక్రవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో తన గదిలో కూర్చుని హాయిగా టీవీ చూస్తున్నారు. ఆ సమయంలో ఇంటి ప్రధాన ద్వారం తెరిచి ఉండటంతో.. సమీప అడవి ప్రాంతం నుంచి వచ్చిన ఒక చిరుత పులి నిశ్శబ్దంగా లోపలికి ప్రవేశించింది. నేరుగా లక్ష్మీ దత్ పాండే ఉన్న గదిలోకి వెళ్లి, ఆయనపై ఒక్కసారిగా లంఘించి దాడికి దిగింది. ఆ క్రూర జంతువు గోళ్లతో, పళ్లతో దాడి చేయడంతో ఆయన తీవ్ర భయాందోళనల మధ్య గట్టిగా కేకలు వేయడం ప్రారంభించారు. ఆయన పెట్టిన ఆర్తనాదాలు వినగానే.. అదే సమయంలో తండ్రిని చూసేందుకు వచ్చిన ఆయన 35 ఏళ్ల కుమార్తె కవితా పాండే ఏమాత్రం తడుముకోకుండా గది వైపు పరుగెత్తుకుంటూ వచ్చింది. అక్కడ తండ్రిని చిరుత పులి గాయపరుస్తున్న భయానక దృశ్యాన్ని చూసి ఆమె వణికిపోలేదు. అత్యంత సాహసంతో ముందుకు ఉరికి, చిరుతపులి పంజా నుంచి తన తండ్రిని బలంగా వెనక్కి లాగింది. ఆపై క్షణాల వ్యవధిలోనే తండ్రిని గది బయటకు తీసుకువచ్చి, లోపల ఉన్న చిరుత పులి పారిపోకుండా గది తలుపులను గట్టిగా వేసి బయట నుండి లాక్ చేసింది.

# ద్వారక లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులుగా పొడిచెట్టి విష్ణువర్ధన్

**హనుమకొండ, జూలై 20 (పీపుల్స్‌డైరీ) :** లయన్స్ క్లబ్ ఆఫ్ ద్వారక ఉపాధ్యక్షులుగా డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల లయన్స్ ఇంటర్నేషనల్ హనుమకొండ లయన్స్ క్లబ్‌కు అనుబంధంగా కొత్తగా ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ ఆఫ్ ద్వారక నూతన శాఖ పదాధికారుల బాధ్యతల స్వీకార కార్యక్రమం హనుమకొండ శాయంపేటలోని లయన్స్ క్లబ్ హాల్‌లో ఘనంగా జరిగింది. హాజరైన సభ్యుల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకొని వారిచే లయన్ డిజి డాక్టర్ నరహరి సుధాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ద్వారక క్లబ్ కు ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. లయన్ డిజి డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ద్వారక శాఖను అందరి సహకారంతో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. సహకారం అందించిన లయన్ డాక్టర్ వలబోజు మోహన్ రావు,విస్తరణ చైర్మన్ లయన్ చల్లా రఘునాథ రెడ్డి,లయన్ ప్రవీణ్,లయన్ ప్రకాష్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా లయన్ విష్ణువర్ధన్ ను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారక లయన్ క్లబ్ అధ్యక్షులు లయన్ గర్రెపల్లి మణికంఠ, కార్యదర్శి లయన్ చిరగోని అభిలాష్, కోశాధికారి లయన్ మంతెన నిఖిల్ తో పాటు పలువురు లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# గొంగళ్ళ వ్యాపారి మండల జగన్నాథం మృతి

- 60 సంవత్సరాలకు పైగా సైకిల్ మీద గొంగళ్ళ వ్యాపారం



**వరంగల్ జులై 20 (పీపుల్స్‌డైరీ) :** 60 ఏండ్లకు పైగా కేవలం సైకిల్‌పైనే గొంగళ్ల వ్యాపారం చేసి ఈ ప్రాంతానికి సుపరిచితుడైన 96 ఏండ్ల వృద్ధుడు జగన్నాథం సోమవారం మృతిచెందాడు. వరంగల్ నగరంలోని రామన్నపేట ప్రాంతానికి చెందిన మండల జగన్నాథం(96) ఉన్నితో తయారుచేసిన గొంగళ్ల వ్యాపారం చేస్తూ రాష్ట్రంలోని కురుమలు నివసించే వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ జీవనం కొనసాగించారు. వరంగల్ రామన్నపేటలోని వారి నివాసంలో అకాల మరణం చెందారు. జగన్నాథంకు భార్య, ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మరణ వార్త తెలియగానే వివిధ జిల్లాల, గ్రామాల నుంచి తండోప తండాలుగా విచ్చేసి మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు మండల సత్తయ్య, ఈర సదానందం, మండల మొగిలి, జిగురు రవి, మండల సురేష్, బండారి మల్లేశం, మండల శంకర్, కంచ మల్లయ్య, మండల కుమారస్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరిగే శ్రీను, మండల నరసింహా రాములు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు.

# పీపుల్స్ డైరీ

వరంగల్

మంగళవారం, 21 జూలై 2026

సంపుటి : 18, సంచిక : 133




## కలెక్టర్ గారు ..మక్కల పైసలేవి..?-చెల్లింపుల కోసం రైతుల ఎదురు చూపులు



- జిల్లాలో 13.500 టన్నుల ధాన్యం సేకరణ
- రూ. 20 కోట్ల మేర చెల్లింపులు పెండింగ్

**రేగొండ జూలై 20 పీపుల్స్ డైరీ :** రేగొండ: రబీ సీజన్‌లో మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో రేగొండ,గోరికొత్త పల్లి మండల వ్యాప్తంగా సంబంధిత రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ రెండో వారం నుంచి మొక్కజొన్న పంట కొనుగోలు చేయగా, మూడు నెలలు గడిచినా ప్రభుత్వం ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయకపోవ డంతో ఇబ్బందులు తప్పడం లేదు. మక్కల కొనుగోళ్ల కోసం మార్క్‌ఫెడ్‌కు బ్యాంక్ గ్యారంటీని ప్రభుత్వం ఇచ్చినప్పటికీ, రుణం విడుదల కాకపోవడంతో రైతులకు చెల్లింపులు నిలిచిపోయాయి. బ్యాంకు రుణం విడుదల చేస్తే తప్ప రైతులకు డబ్బుల చెల్లింపులు జరిగే అవకాశాలు లేవు. ప్రైవేటు మార్కెట్లో అమ్ముకున్నా ఇప్పటికే డబ్బులు చేతికి వచ్చేవని, సాగు ఖర్చులకు ఉపయోగపడేవని రైతులు చెబుతున్నారు. ప్రైవే టును కాదని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే అసలుకే మోసం వచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నెలల తరబడి డబ్బుల కోసం ఎదురు చూడాల్సి రావడంతో మొక్కజొన్న రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కొనుగో లు చేసిన మొక్కజొన్న ధాన్యాన్ని నిల్వ చేసేందుకు సరిపడా గోదాములు లేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

### రూ.20 కోట్ల మేర పెండింగ్...

రేగొండ మండల కేంద్రంలో యాసంగి సీజన్‌లో 7,141 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఎకరానికి 35 క్వింటాళ్ల చొప్పున మొత్తం 2,49, 935 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. మక్కలు కొనుగోలు చే సేందుకు మండలంలోని గోరికొత్తపల్లి ,చిన్నకోడెపాక,రేగొండ,రూపిరెడ్డి పల్లి ,కాకర్ల పల్లి,రేపక, దామరంచ పల్లి,గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోలు చేసిన ముక్కలు సిద్ధిపేట,జమ్మికుంట,మహదేవ్ పూర్,చిట్యాల,ఆయా ప్రాంతాల్లో ఉన్న మిల్లులకు దిగుమతి చేశారు.ఒకే గ్రామానికి చెందిన రైతులు మర్ఫెడ్ లో అమ్ముకన్న కొంత మంది రైతులకు డబ్బులు జమ అయ్యాయి.కొంత మందికి జమ కాలేదు అందరం కలసి మార్క్ ఫెడ్ కు అమ్మిన డబ్బులు ఎందుకు జమ కావడం లేదు అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఓ వైపు కొనుగోళ్లు పూర్తి అయిపోయి ఇప్పటి నెలలు గడుస్తూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వరకు రైతుల ఖాతాల్లో ప్రభుత్వ నగదు జమ చేయలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రక టించిన విధంగా మొక్కజొన్న పంట కు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటాకు రూ. 2400 ఉంది. ఆ లెక్కన ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పంటకు సంబంధించి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రూ.20 కోట్లు జమ చేయాల్సి ఉంది. మరోవైపు పంట సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం డబ్బులు చెల్లించక పోవడం తో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. కొనుగోళ్ల సమయంలో రకరకాల ఆంక్షలు ఎదుర్కోవడం, ఆ తరువాత చెల్లింపుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదంటూ వాపోతున్నారు. ఇదిలా ఉండగా, వానాకాలం సాగు ఏర్పాట్లు కూడా జరుగుతున్నందన ప్రభుత్వం మొక్కజొన్న డబ్బులు చెల్లించాలనే విజ్ఞప్తులు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

### నగదు జమకాలేదు....

మక్కలు కాంటా పెట్టి మూడు నెలలు అవుతోంది.ఇప్పటి వరకు డబ్బులు జమ కాలేదని ఇకనైనా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రైతుల గోస గమనించి ఖాతాలో డబ్బులు జమ అయ్యేవిదంగా చూడాలని కోరుతున్నారు.

## చెస్ క్రీడతో మేధోసంపత్తి పెంపు -చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్

- అంతర్జాతీయ చెస్ డే సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ వేడుకలు నిర్వహించి చెస్ ఆడిన జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యులు



**భూపాలపల్లి జూలై 20 పీపుల్స్ డైరీ :** అంతర్జాతీయ చెస్ డే సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలో చెస్ ప్రాముఖ్యతను గూర్చి ఘనంగా వివరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేసి క్రీడాకారులను అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మరియు గౌరవాధ్యక్షులు పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ, చెస్ క్రీడ మానసిక వికాసానికి, ఏకాగ్రత, మేధోసంపత్తి పెంపొందించుకోవడానికి, నిర్ణయ సామర్థ్యాన్ని మెరుగు పరచుకోవడానికి, స్నేహభావం మరియు ఐక్యతను పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత చెస్ క్రీడను అలవర్చు కోవాలని పిలుపునిచ్చారు. అలాగే అసోసియేషన్ జిల్లా నాయకులు మాట్లాడుతూ, అతి త్వరలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భారీ స్థాయిలో మెగా ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా క్రీడాకారులు పాల్గొనేలా ఈ టోర్నమెంట్‌ను నిర్వహించి, చెస్ క్రీడాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ సభ్యులు అసిఫ్, రాం నారాయణ, సుమన్, దేవేందర్, శ్రీరాములు, కిరణ్, సంతోష్, శంకరయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..

**భూపాలపల్లి జూలై 20 పీపుల్స్ డైరీ..** ప్రజావాణిలో ప్రజలు అందజేసిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 78 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. అధికారులు ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, బాధితులకు తగిన న్యాయం జరిగేలా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, జిల్లాలో జరిగే ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. సీఎం ప్రజావాణికి సంబంధించి 57 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే పరిష్కరించి, ఆయా సమస్యలపై తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్ఓ వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డితో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఇచ్చిన హామీని అమలుచేయాలి

- కోడిగుడ్లు గ్యాస్ నిత్యావసర సరుకులు పూర్తిగా ప్రభుత్వమే సరఫరా చేయాలి- ఏఐటీయూసీ




**ఏటూరు నాగారం జూలై 20 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ఎన్నికలకు ముందు మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని కోడిగుడ్లు, వంట గ్యాస్ ను ప్రభుత్వమే సరఫరా చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో వంట కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వంట కార్మికులను పట్టించుకోకపోవడంతో అనేక పోరాటం చేశామని, ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అవుతున్న వేతనాల విషయంలో ప్రకటన చేయడం లేదని, అల్పాహారం పేరుతో అక్షయ పాత్ర అనే స్వచ్ఛంద సంస్థకు కట్టపెట్టడానికి ప్రభుత్వం సిద్ధప డడం వల్ల వంట కార్మికులను రోడ్డున పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు బండి నర్సయ్య, ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, మాతంగి శ్యాంశుందర్, తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భారతి, ఉపాధ్యక్షులు పోరెడ్డి ప్రమీల, గున్నాల రాజకుమారి, సామ సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



**భూపాలపల్లి జూలై 20 పీపుల్స్ డైరీ..** విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలనీ చదువు పై దృష్టి పట్టాలని టీం ఎస్సై ఫజల్ ఖాన్,తెలిపారు.సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో షీ టీం అవగాహన సదస్సు నిర్వహించారు.భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు జిల్లా షీ టీం ఆధ్వర్యంలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థిను లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థిను లకు గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్, మహిళలపై వేధింపులు, స్ట్రీట్ హరాస్మెంట్, వ్యక్తిగత భద్రత, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదువుపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. తమ పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించి క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు.పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, ఎవరైనా మహిళలు లేదా బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా వెంటనే షీ టీంకు సమాచారం అందించాలని కోరారు. షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 సేవలను వినియోగించాలని, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని వివరించారు.

## చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్



**సింగరేణి (కారేపల్లి) జూలై 20 (పీపుల్స్ డైరీ):** కారేపల్లి మండలానికి చెందిన గెట్ కారేపల్లి గ్రామ వాసులు చెరుకూరి కోటేశ్వరరావు -- ఉమారాణి దంపతుల కుమార్తె, కుమారుడి ఓనిలా అలంకరణ వేడుక మరియు పంచకట్టు వేడుక కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులు సంధ్యారాణి మరియు పార్థులను ఆశీర్వదించి, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్, మాజీ సొసైటీ చైర్మన్ తోటకూరి శ్రీను, మాజీ ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దారావత్ పాండ్య నాయక్, మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, మాజీ మార్కెట్ డైరెక్టర్ వాంకుడోత్ నరేష్, నాయకులు మండేపూడి సత్యనారాయణ, చెరుకూరి రమేష్, చెరుకూరి నర్సయ్య, భూక్య రాంకిషోర్ తదితర నాయకులు, కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## రేగొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఆడిషనల్ ఎస్పీ




**రేగొండ జూలై 20 పీపుల్స్ డైరీ :** జిల్లాలో పోలీసు సేవలను మరింత మెరుగుపర్చే దిశగా జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, సోమవారం రేగొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించి, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, స్టేషన్ సిబ్బంది రామ్మూర్తి, లింగమూర్తి, ఉన్నారు.

## భారత్ కచ్చితంగా ఫిఫా వరల్డ్ కప్‌లో ఆడుతుంది

### ఆ జట్టులో తెలంగాణ స్టార్లు ఉంటారు: సీఎం రేవంత్



గతంలో మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేసుకున్న వైనం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత ఫుట్‌బాల్ భవిష్యత్తుపై తనకున్న దార్శనికతను పంచుకున్నారు. భవిష్యత్తులో టీమిండియా ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్స్‌లో ఆడటమే కాకుండా, ఆ టోర్నీకి ఆతిథ్యం కూడా ఇస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం అర్జెంటీనా, స్పెయిన్ మధ్య ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ జరగనున్న నేపథ్యంలో ఆయన సోషల్ మీడియా వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు.తాను ఫుట్‌బాల్‌ను ఎంతగానో ఇష్టపడతానని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో వరల్డ్ కప్ ఆడే భారత జట్టులో తెలంగాణ నుంచి పలువురు స్టార్లు ఉంటారని జోస్యం చెప్పారు. “ఈ మాట గుర్తుపెట్టుకోండి.. భవిష్యత్ సాకర్ స్టార్లు చాలామంది తెలంగాణ నుంచే వస్తారు” అని ఆయన అన్నారు. ఫిఫా వరల్డ్ కప్‌కు తన మద్దతు వెనుక లోతైన ఉద్దేశం, దార్శనికత ఉన్నాయని వివరించారు.గతంలో ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొచ్చి, తెలంగాణ పిల్లలతో కలిసి మైదానంలో పాలుపంచుకునేలా చేసిన రోజును తాను ఎంతో ఇష్టపడతానని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. చివరగా, ఫుట్‌బాల్ అభిమానులందరూ ఫైనల్ మ్యాచ్‌ను ఆస్వాదించాలని ఆయన ఆకాంక్షించారు.

## మర్కోడు ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఏఐఎస్ఎఫ్ బృందం

### ఆశ్రమ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి-ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి తాళ్లపల్లి వినయ్



**ఆళ్ళపల్లి జూలై20(పీపుల్స్ డైరీ) :** ఆళ్ళపల్లి మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మర్కోడు ఆశ్రమ పాఠశాలను సందర్శించి అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకొని విద్యార్థులతో భోజనం చేయడం జరిగింది, ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఆళ్ళపల్లి మండల కార్యదర్శి తాళ్లపల్లి వినయ్ మాట్లాడుతూ. దేశంలో రాష్ట్రంలో గాని విద్యా వ్యతిరేక విధానాలకు, పాల్పడుతున్నటువంటి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా విద్యు హక్కులను సాధించుకునె విధంగా విద్యార్థులు పోరాడాలని ఆయన పిలిపిచ్చారు,పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలపై ప్రభుత్వం దృష్టి సారించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని తాళ్లపల్లి వినయ్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంల ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎస్.కె ఆరిఫ్ కిసారి శివ తదితరులు పాల్గొన్నారు

# పారిశుద్ధ్య కార్మికులకు శానిటైజేషన్ కిట్ల పంపిణీ



**మిరుదొడ్డి, జూలై 20 :** వర్షాకాలం నేపథ్యంలో చెప్యాల గ్రామ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి సోమవారం శానిటైజేషన్ కిట్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కమటం అంకిత నరేష్ కార్మికులకు కిట్లను అందజేసి మాట్లాడుతూ వర్షాకాలంలో కార్మికులకు అనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యల్లో పారిశుద్ధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారు మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రతి కిట్ లో గ్లోవ్స్, మాస్కులు, సబ్బులు, శానిటైజర్ తదితర సామగ్రి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నవీన్ రెడ్డి, అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# న్యూ శాతవాహన పాఠశాలలో ఘనంగా మెహందీ సెలబ్రేషన్స్

**విద్యార్థులు, ఉపాధ్యాయుల ఉత్సాహభరిత భాగస్వామ్యం**



**హుజూరాబాద్, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** హుజూరాబాద్ పట్టణంలోని ఇందిరా మార్గ్‌లో గల న్యూ శాతవాహన ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో మెహందీ సెలబ్రేషన్స్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.విద్యార్థినులు అందమైన మెహందీ డిజైన్లు వేయించుకుని భారతీయ సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పాఠశాల ఆవరణను రంగురంగుల అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దగా, కార్యక్రమం ఆకట్టుకుంది.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వకుళాభరణం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... విద్యార్థులకు విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి కార్యక్రమంలో పాల్గొని వారిని అభినందించారు.వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో ముగియగా, విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# బి.సి. సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కందికొండ మొగిలి

**లిబి. సి. సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్య సభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ఆదేశాల మేరకు నియామకం**




**హుజురాబాద్, జూలై 18 (పీపుల్స్ డైరీ):** జాతీయ బి.సి. సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా హుజురాబాద్ మండలం సిర్సపల్లి గ్రామానికి చెందిన కందికొండ మొగిలి నియమితులయ్యారు. బి.సి.ల సామాజిక, రాజకీయ చైతన్యం కోసం, వారి సమస్యల పరిష్కారానికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గొర్ల అయిలేశ్ యాదవ్ తెలిపారు. జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు.నాయకులకు కృతజ్ఞతలు తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య, జాతీయ ప్రధాన కార్యదర్శి గొర్ల అయి-లేశ్ యాదవ్‌లకు కందికొండ మొగిలి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ నియామకానికి సహకరించిన సంఘం నాయకులు పొలవేని పోచమల్లు యాదవ్, సందెల వెంకన్న, పీరెల్ల సాగయ్య, భీమ సాయిలు యాదవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

**బి.సి. హక్కుల కోసం కృషి చేస్తా :** ఈ సందర్భంగా మొగిలి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా బి.సి.ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. బి.సి.లను సంఘటితం చేసి, చట్టసభల్లో బి.సి.లకు రిజర్వేషన్లు సాధించే దిశగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

# రెవిన్యూ డివిజన్ ఆమోదం కోసం మెమోరాండం ఇచ్చిన బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు

- రెవిన్యూ డివిజన్ ఆమోదం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో మెమోరాండం ఇచ్చిన బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు-: డా జాడి రామరాజు నేత



**ఏటూరు నాగారం జులై 20 (పీపుల్స్ డైరీ) :** బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షునిగా రెవిన్యూ డివిజన్ పై స్పాందిస్తారా లేక మంత్రి కి గూఢచారిగానే ఉంటారా...? ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ అవుతే 6మండలాలోని 92000వేల ఎకరాల భూమి, 35000వేల మంది రైతుల భూమీ సమస్య పరిస్కారం అవుతుంది. రెవిన్యూ డివిజన్ ఏర్పాటు అవుతే దళిత బహుజన మైనార్టీ వర్గాలరైతుల భూములకు రక్షణ ఉంటది. సోమవారం రోజున ములుగు జిల్లా కేంద్రం లో బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ అమోదించక పోవడానికి కారణం ఏమిటో వివరణ ఇవ్వాలాని రెవిన్యూ డివిజన్ ఆమోదం పొందెల చూడాలని కలెక్టర్ కార్యాలయం లో గ్రీవెన్స్ లో మెమోరాండం ఇవ్వడం జరిగింది. అదేవిదంగా కొంతమంది రాజకీయ నాయకులు రెవిన్యూ డివిజన్ ఆమోదం పొందకుండా అడ్డుకుంటున్నా మైదాన ప్రాంతనాయకురాలు మద్దతు ఉండడంవలనే ఆమోదం పొందడం లేదని అన్నారు. అదేవిదంగా ములుగు ఎమ్మెల్యే తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఆదేశాల జారీ చేస్తేనే ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ పై స్పందిస్తారా లేక మంత్రి కి గూఢచారిగానే ఉంటారా అన్నారు. 2023 సెప్టెంబర్ లో బీజేపీ ఆధ్వర్యంలో రెవిన్యూ డివిజన్ కోసం నిరాహార దీక్ష చేసి సాధించింది బీజేపీ పార్టీ అన్నారు. అదేవిదంగా 2023 అక్టోబర్ 7తేది రోజున నాటి ప్రభుత్వం రెవిన్యూ డివిజన్ ప్రకటన చేస్తూ జీవో విడుదల చేసినప్పుడు ఇప్పుడున్నా బి ఆర్ ఎస్ అధ్యక్షులు ప్రజలను నమ్మించడానికి పాలాభి శేఖం చేసి రంగులు పూసుకొని తొడలు కొట్టుకొని ప్రగల్బాలు పలికిన నాయకులు ఇప్పుడు స్పందించక పోవడానికి కారణం ఏమిటన్నారు. అదేవిదంగా ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం వాజేడు, వెంకటాపురం మండలలో వ్యవసాయం చేస్తున్నా 78వేల మంది సన్న చిన్న కారు రైతులు 1. ఒక లక్ష 90వేల ఎకరాలు భూమి సాగుచేస్తున్నా రైతులకు సాగు నీరు లేక భూములు బీడు పోతున్నాప్పటికీ దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ నుండి మైదాన ప్రాంతానికి నీళ్లు తరలించుకొని పోతుంటే బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు ఎందుకు స్పందించడం లేదన్నారు. అందుబాటులో రెవిన్యూ డివిజన్ లేక ఉన్నత మైన ప్రభుత్వఅధికారులు అందుబాటులో లేక పోవడం వలన సంత్సరానికి చట్టాల పేరుతో దళిత బహుజన వర్గాల రైతుల 1000 ఎకరాలభూమి భూకబ్జాకు గురివుతుం దన్నారు. ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ ఏర్పాటు అవుతే పోడుకొట్టుకొని సాగు చేస్తున్నా 92 వేలఎకరాల భూమి 35000వేల మంది రైతులసమస్య పరిస్కారం అవుతుందాని అన్నారు. ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ ఆమోదం పొందిన తర్వాత ఈ ప్రాంతం లో దళిత బహుజన మైనార్టీ వర్గాల భూములు కబ్జాలకు గురి కాకుండా ఉంటాయని అన్నారు. అదేవిదంగా ఈ ప్రాంతం లో ఉన్నా బి ఆర్ ఎస్ కాంగ్రెస్ సిపిఐ సిపిఎం మైదాన ప్రాంత నాయకుల జెండాలు మొయ్యడానికి పాలాభిషేఖం చెయ్యడానికి కాకుండా ఏజెన్సీ ప్రాంత ప్రజలు రైతుల అభివృద్ధి కోసం బి ఆర్ ఎస్ కాంగ్రెస్ సిపిఎం సిపిఐ ఆదివాసీ దళిత బహుజన మైనార్టీ ప్రజా సంఘాల నాయకులు స్పందించాలని డా జాడి రామరాజు నేత అన్నారు.

# గిరిజన దర్బార్ లో సమర్పించిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలి

**ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐ.టి.డి.ఏ**



**ఏటూరునాగారం జూలై 20 (పీపుల్స్ డైరీ) :** సోమవారం సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో గిరిజనుల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి సమస్యలను త్వరీతగతిన పరిష్కారం చూపాలని సంబంధిత సెక్టార్ అధికారులకి గౌరవ ప్రాజెక్ట్ అధికారి శ్రీ.లెనిన్ వత్సల్ టోప్పో ఐ.ఏ.ఎస్. ఐ.టి.డి.ఏ ఏటూరు నాగారం గారు ఆదేశించినారు. ఈ గిరిజన దర్బార్ లో వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజనులు (19) దరఖాస్తులు ప్రాజెక్ట్ అధికారికి స్వయంగా గిరిజనులు సమర్పించడం జరిగింది.తొర్రూర్ డబ్బతండ గ్రామం మహబూబాబాద్ జిల్లా నుండి తన భర్త మరణించడం వలన కారుణ్య నియామకం క్రింద తన కూతురి కి వర్కర్ పోస్టు ఇచ్చారు. అట్టి పోస్టు ను నా కుమార్తె చేయలేదు. కావున అట్టి పోస్టింగ్ రద్దు చేస్తూ మా యొక్క దరకాస్తు ను జిల్లా కలెక్టర్ మహబుబాబాద్ జిల్లా కి పంపించుట గూర్చి దరకాస్తు చేసినారు. బుటారం గ్రామం ఏటూర్ నాగారం మండలం నుండి గతం లో చేసిన కుటుంబ సర్వే లో మైగ్రేటెడ్ అని పడింది. నా యొక్క కుటుంబాన్ని మైగ్రేటెడ్నుండి తొలగించి ఇందిరమ్మ ఇండ్లు 4 కు మార్చుట గూర్చి దరకాస్తు చేసినారు. మాదవరపు పల్లి గ్రామం ములుగు మండలం వరంగల్ జిల్లా నుండి గత 15 సంవత్సరాలుగా గిరిజన ఆశ్రమ హైస్కూల్ నందు సిఆర్టిటీచర్ గా పని చేస్తున్న భూక్య ప్రతాప్ సింగ్ 26.04.26నాడు హార్ట్ అటాక్ తో మరణించడం జరిగింది. బి.ఎడ్ బయోలాజికల్ సైన్స్ చేసి ఉన్నాను నాకు నా భర్త పోస్టు నాకు ఇప్పించుట గూర్చి దరకాస్తు చేసినారు. కొంగాల గ్రామం వాజేడు మండలం నుండి వితంతు మహిళా అయినా నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరి గూర్చి దరకాస్తు చేసినారు. మల్లం పల్లి గ్రామం మల్లం పల్లి మండలం నుండి క్వార్టర్స్ ఇప్పించుట గూర్చి దరకాస్తు చేసినారు.మంగలవారి పేట గ్రామం ఖానాపురం మండలం వరంగల్ జిల్లా నుండి డీఎస్సీ 2008 లో సెలెక్ట్ అయ్యాను అట్టి 2008 సంబందించిన రికార్డు కోరడం జరిగిన దాని గూర్చి దరకాస్తు చేసినారు. బుర్గు పేట గ్రామం వెంకటాపుర్ మండలం నుండి బుర్గుపేట్ గ్రామం లో ఇల్లు మంజూరి చేయుట గూర్చి దరకాస్తు చేసినారు. మ్రిమిట్ట గ్రామం గూడూరు మండలం మహబూబాబాద్ జిల్లా నుండి అంగన్ వాడి బడి బిల్డింగ్ బిల్లు ఇప్పించుట గూర్చి దరకాస్తు చేసినారు. మ్రిమెట్ట గ్రామం గూడూరు మండలం మహబూబాబాద్ జిల్లా నుండి ౦+ఒఔఖ=జీఖ (స్త్ర) టీజీటీ డబ్ల్యు ఆర్ జే యు (బా )గాంధీ నగర్ కొత్తగూడ యందు ఖాళీ గా ఉన్న స్వీపర్ లేదా అటెండర్, వాచ్ మెన్ గా నియమించుట గూర్చి దరకాస్తు చేసినారు. దుబ్బా తండ గ్రామం తోర్రురు మండలం మహబూబాబాద్ జిల్లా నుండి బెస్ట్ అవైలబుల్ స్కీం క్రింద 8వ తరగతి సీటు ఇప్పించుట గూర్చి దరకాస్తు చేసినారు.

పర్షా తండ గ్రామం ఖానాపురం మండలం వరంగల్ జిల్లా నుండి ఇందిర సౌర గిరి జల వికాసం పథకం క్రింద బోరు మంజూరి చేయుట గూర్చి దరకాస్తు చేసినారు. పర్షా తండ గ్రామం ఖానాపురం మండలం మహబూబాబాద్ జిల్లా నుండి ఇందిర సౌర గిరిజల వికాసం క్రింద బోరు మంజూరి చేయుట గూర్చి దరకాస్తు చేసినారు. బుటారం గ్రామం ఏటూర్ నాగారం మండలం ములుగు జిల్లా నుండి ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయుట గూర్చి దరకాస్తు చేసినారు.ఆకులవారి ఘనపురం గ్రామం ఏటూర్ నాగారం మండలం నుండి ఆర్ ఐ టి ఐ లో అత్తేందర్ పోస్ట్ ఖాళీ గా ఉన్నది కావున నాకు ఆ పోస్టు ఇప్పించుట గూర్చి దరకాస్తు చేసినారు. ఆకులవారి ఘనపురం గ్రామం ఏటూర్ నాగారం మండలం నుండి ఆర్ ఐ టి ఐలో స్వీపర్ పోస్ట్ ఖాళీ గా ఉన్నందు నాకు ఇప్పించుట గూర్చి దరకాస్తు చేసినారు. పుసురు గ్రామం వాజేడు మండలం నుండి ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేయుట గూర్చి దరకాస్తు చేసినారు. మంగలవారి పేట గ్రామం ఖానాపురం మండలం వరంగల్ జిల్లా నుండి నేను డీఎస్సీ2008 లో సెలెక్ట్ అయ్యాను అట్టి 2008 సంబంచిన రికార్డ్ ఇప్పించుట గూర్చి దరకాస్తు చేసినారు. గూడూరు గ్రామం గూడూరు మండలం మహబూబాబాద్ జిల్లా నుండి ఆర్ ఐ టి ఐ2005 ప్రకారం 7.02.2026 రోజున సమాచారం కోరగా ఇవ్వకపోవడం గూర్చి దరకాస్తు చేసినారు.చాల్వాయి గ్రామం గోవిందరావు పేట మండలం నుండి చాల్వాయి గ్రామ ప్రజలు పొలములకు దారి ఏర్పాటు చేయుట గూర్చి దరకాస్తు చేసినారు. ఈ కార్యక్రమం లోస్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.ప్రతాప్ ఇంచార్జ్ ఏ.పి.వో.(జి),డిప్యూటీ డైరెక్టర్ డి.జేనార్దన్ డిప్యూటి డైరెక్టర్,హెచ్డి ఈ ఈ ట్రావెల్ వెల్ఫేర్కే.సిరేష్, డిప్యూటీ బియ్యం ఒ హెచ్ ఓకే క్రాంతి కుమార్, డి ఎ యం జి సి సి.కే.వాని,పేసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ పేసా కో-ఆర్డినేటర్, జువాలజిస్ట్ ఏ.కిషోర్ జియాలజిస్ట్, ఆర్ ఐ టి ఐ ప్రిన్సిపాల్ ఎస్.జెగన్ మోహన్ రెడ్డి, టీఎస్ ఆర్టీసీ మేనేజర్ ఎల్.శంకర్, మరియు సంబందిత అధికారులు గ్రీవెన్స్ సెల్ లో పాల్గొన్నారు.

# దళిత-గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేయాలి



**సింగరేణి (కారేపల్లి) జూలై 20 (పీపుల్స్ డైరీ):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి మండలం లోని దళిత, గిరిజన ఆవాస ప్రాంతాల సమస్యలపై నిర్వహించిన సర్వేలో పలు కీలక సమస్యలు వెలుగులోకి వచ్చాయని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, గృహాలు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉ ందని, భూమిలేని వ్యవసాయ కార్మికులు ఉపాధి హామీ చట్టం సవరణతో, జీవనోపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారుదళిత, గిరిజన ఆవాస ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం కేటాయించిన నిధులను ఎలాంటి ఆలస్యం లేకుండా విడుదల చేసి, ఆ నిధులను దళిత, గిరిజన ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి నిధుల చట్టం అమలులో ఉందని, దాని లక్ష్యం ఈ వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం జిల్లా లో ఐటీడీఏ ను ఏర్పాటు చేయాలి అన్నారు. అంతోదయ అన్నపూర్ణ కార్డు లబ్ధిదారులుగా పేద దళిత, గిరిజనులు అత్యధిక మంది ఉన్నారని 35 కిలోల బియ్యం అందించే ఈ కార్డులు రద్దు చేయడం వల్ల వర్గాలకు తీవ్ర నష్టం జరుగుతుందని కేంద్రం అంతోదయ కార్డుల రద్దు ప్రయత్నం విరమించుకోవాల న్నారు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు మొదటి విడత లో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసిన లబ్ధిదారులకు చివరి బిల్లులు నేటికీ విడుదల కాలేదా కేంద్రం ఇవ్వవలసిన ఎన్ఆర్ఈజీ ఎస్ కింద ఇచ్చే రూ 60 వేలు వెంటనే విడుదల విడుదల చేయాలని దళిత గిరిజనులకు 6 లక్షల రూపాయల బిల్లులు చెల్లిస్తామన్న హామీని అమలు చేయాలని రెండో విడతలో అర్హులైన వారందరికీ రాజకీయ పక్షపాతా లేకుండా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు విద్య వైద్యం ఇల్లు ఇళ్ల స్థలాలు పోడుహక్కుల ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సర్వేలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు ఆయన డిమాండ్ చేశారు. నిరుపేద దళిత, గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు.

# సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో 22 జూలై నుంచి 6 ఆగస్టు వరకు సిటీ పోలీస్ యాక్ట్

**పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూలై 20 :** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జూలై 22 ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 6 ఉదయం 6 గంటల వరకు సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాలంలో కమిషనరేట్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే సంబంధిత ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. బంద్‌ల పేరుతో సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయాలని ఒత్తిడి చేయడం లేదా బెదిరింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా జూలై 22 నుంచి ఆగస్టు 6 వరకు కమిషనరేట్ పరిధిలో అధిక శబ్దంతో డీజే సౌండ్ వినియోగంపైనా నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థులకు శబ్ద కాలుష్యం వల్ల ఇబ్బందులు కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మైక్ సెట్ వినియోగం అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత, సిటీ పోలీస్ యాక్ట్-1348 ఫాస్లి, పోలీస్



యాక్ట్-1861లోని సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ స్పష్టం చేశారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
మంగళవారం, 21 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 133


# జమ్మికుంట కస్తూర్బా బాలికల హాస్టల్‌లో దయనీయ పరిస్థితులు

- వారం రోజులుగా నీటి కోసం విద్యార్థినుల అవస్థలు
- నాణ్యమైన భోజనం కరువు -- పురుగుల అన్నం తింటున్నారంటూ తల్లిదండ్రుల ఆందోళన



**జమ్మికుంట, జూలై 20 పీపుల్స్ డైరీ.:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) హాస్టల్‌లో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా హాస్టల్‌లో తాగునీరు, స్నానానికి అవసరమైన నీరు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. హాస్టల్‌లో సరిపడా నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థినులు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. మరోవైపు అందిస్తున్న భోజనం కూడా నాణ్యత లేకుండా ఉందని, అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థినులు వాపోతున్నట్లు సమాచారం. ఇలాంటి ఆహారాన్ని తినాల్సి రావడంతో వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను ఇంట్లో చెప్పడానికి కూడా విద్యార్థినులు భయపడుతున్నారని, చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి హాస్టల్‌లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. "అధికారులు ఉన్నట్టా... లేనట్టా?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత శాఖ అధికారులు ఇప్పటివరకు హాస్టల్‌ను సందర్శించి సమస్యలను పరిష్కరించ కపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితిపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# మాలపల్లిలో వాతావరణ అనుకూల వ్యవసాయంపై రైతులకు అవగాహన



**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 20:** వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు స్థిరమైన, పర్యావరణహిత సాగు పద్ధతులను అవలంబించాలని వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు సూచించారు. హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో రైతులకు వాతావరణ అనుకూల వ్యవసాయం, కార్బన్ క్రెడిట్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత, కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు వెన్న రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెన్న రాజు మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావంతో వ్యవసాయ రంగం సవాళ్లను ఎదుర్కొంటోందని, రైతులు ఆధునిక, పర్యావరణహిత సాగు విధానాలను అవలంబించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించి సాగు ఖర్చులను నియంత్రించవచ్చని అన్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతికత, భవిష్యత్తు అవకాశాలపై అవగాహన పెంచి ఆదాయ వృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు మాట్లాడుతూ పంట అవశేషాల నిర్వహణ, సేంద్రియ పదార్థాల వినియోగం, నీటి సంరక్షణ, చెట్ల పెంపకం వంటి పర్యావరణహిత పద్ధతులను పాటించడం ద్వారా నేల సారం మెరుగుపడి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని వివరించారు. అలాగే కార్బన్ క్రెడిట్‌కు సంబంధించిన ప్రాథమిక అవగాహన, అర్హత ప్రమాణాలు, నమోదు విధానం, భవిష్యత్తులో లభించే అవకాశాలపై రైతులకు వివరించారు. ఏ ప్రాజెక్టు లేదా ఒప్పందంలో చేరే ముందు నిబంధనలను పూర్తిగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ రాష్ట్ర ఇన్‌చార్జి పల్లె వెంకటేష్ గౌడ్, ఢిల్లీ మేనేజర్ దేవాన్ష్, ప్రతినిధి దేవాన్, హుస్నాబాద్ ఫీల్డ్ కోఆర్డినేటర్ చిట్యాల ఇసాక్, వార్డు సభ్యులు సొల్లు రజినీకాంత్, బత్తుల వీరస్వామి, బత్తుల కవితతో పాటు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులు తమ వివరాలను నమోదు చేసుకుని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# దేవాదుల ధర్మసాగర్ నార్త్ కెనాల్ ద్వారా సాగునీరు విడుదల చేయాలి

- భీమదేవరపల్లి బీఆర్ ఎస్ మండల అధ్యక్షులు మండల సురేందర్ హెచ్చరించారు.



**భీమదేవరపల్లి, జూలై 20: (పీపుల్స్ డైరీ ):** దేవాదుల ధర్మసాగర్ నార్త్ కెనాల్ ద్వారా రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని భీమదేవరపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మండల సురేందర్ డిమాండ్ చేశారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్ ఆదేశానుసారం, భీమదేవరపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముల్కనూర్ కెనాల్ వద్ద రైతుల సాగునీటి సమస్యలపై భారీ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మండల సురేందర్ మాట్లాడుతూ.. ధర్మసాగర్ రిజర్వాయర్ లో ప్రస్తుతం 306.2 అడుగుల నీటి మట్టం ఉండి, నార్త్ కెనాల్ తూము వద్ద నీరు విడుదల చేయడానికి తగినంత హెడ్ అందుబాటులో ఉన్నా ప్రభుత్వం నీరు విడుదల చేయకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. జూన్ మొదటి వారంలోనే ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లోని చెరువులను నింపి రైతులకు సాగునీరు అందించాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్ ఒక్క ఫోన్ కాల్‌తో సాగునీరు విడుదల చేయించేవారని, కానీ ప్రస్తుతం హుస్నాబాద్ నియోజకవర్గానికి మంత్రి ఉన్నప్పటికీ రైతులకు సకాలంలో సాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రెండు రోజుల్లోగా నీరు విడుదల చేయకపోతే ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల రైతులతో కలిసి ధర్మసాగర్ నార్త్ కెనాల్ తూము వద్ద భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ వంగ రవీందర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఈ ధర్నా-రాస్తారోకో కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గద్ద కుమారస్వామి, కొండ్ర రజనా చారి, శనిగరం సదానందం, నాయిని రవీందర్, మిరియాల రాజు, మాడిశెట్టి కుమారస్వామి, ధర్నా శ్రీనివాస్, మాడుగుల అశోక్, కుక్కరుకొండ రాజు, గుతుపల సతీష్, పోలు మహేందర్, రచ్చ సంపత్, కాల్వ సంపత్, గద్ద సంపత్, కొత్తకొండ రాజమౌళి, కొత్తకొండ నాగరాజు గురు సమ్మయ్య, కండె సుధాకర్, గుడికందుల రాజు, అలుగు సంపత్, గుడికందుల బాలరాజు, గద్వాల ప్రశాంత్, బర్మ రవీందర్, పల్లవిన రమేష్, కనకం వినయ్, ఎదులాపురం మొగిలి, ఎదులాపురం మొగిలి, సంపత్, వల్లెపు సుధాకర్, మాడుగుల సుభాష్, నరేందర్, కొమ్ముల రవి, పెద్ద సంఖ్యలో రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాంటిస్సోరి హైస్కూల్‌లో మాక్ ఎన్నికలు..

## విద్యార్థుల్లో ప్రజాస్వామ్య చైతన్యానికి నాంది




**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 20 :** రేపటి బాధ్యతాయుతమైన ఓటర్లుగా, సమాజానికి నాయకత్వం వహించే పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో హుస్నాబాద్ పట్టణంలోని మాంటిస్సోరి హైస్కూల్‌లో వినూత్నంగా మాక్ ఎన్నికలు నిర్వహించారు. నిజమైన ఎన్నికల వాతావరణాన్ని ప్రతిబింబించేలా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి, ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ నామినేషన్ నుంచి ప్రచారం, రహస్య ఓటింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు మొత్తం ఎన్నికల ప్రక్రియను క్రమబద్ధంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ ఎన్నికల్లో విద్యార్థులే అభ్యర్థులుగా బరిలోకి దిగి తమ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఓటర్లను ఆకర్షించేందుకు తమ హామీలను వివరిస్తూ ప్రచారం చేశారు. అనంతరం విద్యార్థులు రహస్య బ్యాలెట్ విధానంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాఠశాలలో నిజమైన ఎన్నికల సందడి నెలకొంది. పోలింగ్ ముగిసిన అనంతరం ఉపాధ్యాయుల సమక్షంలో పారదర్శకంగా ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ మన్నన్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థ, బాధ్యతాయుతమైన ఓటు హక్కు, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇలాంటి కార్యా చరణల ద్వారా చిన్నప్పటి నుంచే ప్రజా స్వామ్య స్ఫూర్తి, బాధ్యతాయుతమైన పౌరసత్వం, నిర్ణయ సామర్థ్యం పెంపొం దుతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో జరిగిన ఈ మాక్ ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రజాస్వామ్య పండుగను ఆస్వాదించారు. విజేతలను అభినందించిన నిర్వాహకులు, పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థిని అభినందిస్తూ వారి క్రీడాస్ఫూర్తిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె. రవీందర్, షాజు థామస్, ఏహెచ్ఎం సునీల కుమారి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవా ప్రశంసలు అందుకున్న పోలీసు సిబ్బందికి ఘన సన్మానం



**హుజురాబాద్, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చేతుల మీదుగా ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందుకున్న హుజురాబాద్ పోలీసు సిబ్బందిని బి.సి. జాతీయ సంక్షేమ సంఘం హుజురాబాద్ నియోజకవర్గ జనరల్ సెక్రటరీ దేవసాని ప్రియదర్శిని ఘనంగా సన్మానించారు.

## శాలువాలతో సత్కారం


ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందుకున్న బి. అంజలి, కె. రాజేశ్వర్ రావు, జె. మహేందర్, డ్రైవర్ ప్రసాద్లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

## సేవా స్ఫూర్తికి అభినందనలు

ప్రజల భద్రత కోసం అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రశంసలు అందుకోవడం గర్వకారణమని దేవసాని ప్రియదర్శిని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

# హుస్నాబాద్ బీజేపీ మండల కమిటీ ప్రకటింపు

## నూతన కార్యవర్గానికి బాధ్యతలు.. పార్టీ బలోపేతమే లక్ష్యం


Husnabad Mandal Committee

**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 18 :** బీజేపీ హుస్నాబాద్ మండల పార్టీ నూతన కార్యవర్గంతో పాటు వివిధ మోర్చాల మండల అధ్యక్షులను మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ శనివారం ప్రకటించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆశీస్సులు, బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ఆదేశాల మేరకు, జాతీయ, రాష్ట్ర పార్టీ మార్గదర్శకాల ప్రకారం నియమించామని తెలిపారు. నూతన మండల కమిటీలో ఉపాధ్యక్షులుగా భూతగడ్డ బాలరాజు, రాగుల చంద్రశేఖర్ రెడ్డి, కుంట మల్లయ్య, బత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా తడిసిన రమేష్ రెడ్డి, బైరి అరుణ్, కార్యదర్శులుగా బాలగోని మల్లేష్, నార్లపురం సత్యం, తాళ్లపల్లి చంద్రం, బాషవేణి వెంకటేష్, కోశాధికారిగా కనకంట్ల కిషన్‌ను నియమించారు. ఈ సందర్భంగా మండల కమిటీ ఏర్పాటుకు సహకరించిన బీజేపీ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల కుమార్, జిల్లా కార్యదర్శి పైడిపల్లి పృథ్వీరాజ్లకు మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నియమితులైన నాయకులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు హుస్నాబాద్ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ నియామకాలు నేటి నుంచే అమల్లోకి వస్తాయని మండల అధ్యక్షుడు వెల్లడించారు.

# ఎల్ లినో ప్రభావంతో రైతాంగం ఆందోళన

## ఆరుతడి పంటలే రైతులకు దిక్కు - యువ రైతు హరీష్ వర్మ అప్పని



**వీణవంక జులై 21( పీపుల్స్ డైరీ) :** ఎల్ లినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తీవ్రంగా తగ్గిపోతున్న నేపథ్యంలో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతోంది. గత కొన్ని నెలలుగా వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తూ, అధిక నీటి అవసరం ఉండే పంటలకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచిస్తున్నారు. అయితే రైతులు ప్రకృతి వైపరీత్యాలు, పెరుగుతున్న సాగు ఖర్చులు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నేను నా వ్యవసాయ భూమిలో పెసర పంటను సాగు చేశాను. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ పంటలపై ఆధారపడితే నష్టాలు తప్పవని, తక్కువ నీటితో సాగయ్యే పెసర, కంది, మినుము వంటి ఆరుతడి పంటల వైపు మళ్లాల్సిన అవసరం ఉందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నాను. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కేవలం సూచనలు ఇవ్వడం కాకుండా, ఆరుతడి పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సబ్సిడీలు మార్కెట్ భరోసా కల్పించాలి. రైతులు పంటలు పండించిన తర్వాత గిట్టుబాటు ధరలు లేక నష్టపోతే వారి పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. వ్యవసాయం లాభసాటి కాకపోయినా దేశానికి అన్నం పెట్టే రైతన్నను ప్రభుత్వం విస్మరించకూడదు. వర్షాభావ పరిస్థితులను యుద్ధ ప్రాతిపదికన ఎదుర్కొంటూ రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. రైతులు కూడా ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకొని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలను పాటిస్తూ ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు అన్నారు


# సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం




**శంకరపట్నం జులై :20 పీపుల్స్ డైరీ:** కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో CPI జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు పిట్టల సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశమునకు ముఖ్య అతిథిగా CPIసీనియర్ నేత, మాజీ మీూా చాడ వెంకటరెడ్డి. హాజరై మాట్లాడారు. ఈ సమావేశములో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, టేకుమల్ల సమ్మయ్య, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై ఇష్టానుసారంగా కేజీవిల్స్

## ఉప సర్పంచ్ బోళ్ల పరమేశ్వర్ వార్డు సభ్యులు రవీందర్ ప్రవీణ్ డిమాండ్



**సైదాపూర్ జూలై 20 ( పీపుల్స్ డైరీ ) :** సైదాపూర్ మండల కేంద్రం నుండి పెర్కపల్లి నూతన రోడ్డుపై కొందరు టా క్టర్ యజమానులు రైతులు ఇష్టా నుసారంగా రహదారిపై కేజీ వీల్స్ తో ట్రాక్టర్ నడుపుతున్నారు. కోట్లు వెంచించి రహదారులు వేస్తున్న రైతులు నిబంధనలను బేఖారతు చేస్తూ నిబంధనలు పట్టించుకోవడం లేదు. రోడ్డు పనులు ఇంకా పూర్తవకముందే ఇలా చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పట్టించుకోని యజమానులపై సంబంధిత అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పెర్కపల్లి గ్రామ ఉపసర్పంచ్ బోళ్ళ పరమేశ్వర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు కాశ వేణి రవీందర్, సీనియర్ నాయకుడు హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పోలు ప్రవీణ్ డిమాండ్ చేశారు .



# సోషల్ మీడియాకు దూరంగా ఉంటే.. హాయిగా ఉంది

## నటి ఐశ్వర్య లక్ష్మి వెల్లడి

సోషల్ మీడియాకు దూరంగా ఉండటం వల్ల ప్రాణం హాయిగా ఉందని కేరళ సోయగం ఐశ్వర్య లక్ష్మి అన్నారు. తాజా ఇంటర్వ్యూలో తాను చేస్తున్న సినిమాల గురించి, సోషల్ మీడియా గురించి ఆసక్తికరంగా మాట్లాడారామె. 'ఒకప్పుడు సోషల్‌మీడియాలో చురుగ్గా ఉండేదాన్ని. కానీ నా ఫొటోలు మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన కామెంట్లు పెట్టి కొందరు నన్ను బాధపెట్టారు. వాళ్ల వల్ల అంతా నన్ను ద్వేషిస్తున్నట్టు అనిపించేది. ఇప్పుడు సోషల్‌మీడియాకు దూరంగా, ప్రేక్షకులకు దగ్గరగా ఉంటున్నా. వందకోట్లు ఇచ్చినా మళ్లీ సోషల్ మీడియా జోలికి మాత్రం పోను' అంటూ తెగేసి చెప్పింది ఐశ్వర్య లక్ష్మి. తన తాజా సినిమా 'గట్టాకుస్తీ 2' గురించి మాట్లాడుతూ 'గట్టాకుస్తీ 2' మంచి విజయం సాధించిందని అంతా అంటుంటే ఆనందంగా ఉంది. స్త్రీ,పురుష సమానత్వాన్ని ప్రతిబింబించే సినిమా అది. అందుకే అది నా మనసుకు దగ్గరైన సినిమా.' అంటూ ఐశ్వర్యలక్ష్మి ఆనందం వెలిబుచ్చింది. ప్రస్తుతం ఓ ఫీమేల్ సెంట్రిక్ మూవీలో పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నది ఐశ్వర్యలక్ష్మి. 'తీవియన్ పాట్రు', 'లవ్' అనే వెబ్ సిరీస్‌లు కూడా ఈ అమ్మడి చేతిలో ఉన్నాయి. త్వరలో తెలుగు ప్రేక్షకులను కూడా ఈ అందాలభామ పలకరించనున్నదని టాక్.



# జాతీయ అవార్డు రావడం మెగా విజయం

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా రూపొందించిన 'కమిటీ కుర్రోళ్ళు' చిత్రం జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది. గ్రామీణ నేపథ్యంతో, కొత్త నటీనటులతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రతిష్టాత్మక 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో రెండు అవార్డులు గెలుచుకుని తెలుగు సినీ పరిశ్రమకు మరోసారి గర్వకారణంగా నిలిచింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లో చిత్రబృందం ప్రత్యేక సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా మాట్లాడిన నిర్మాత నిహారిక కొణిదెల తన ఆనందాన్ని భావోద్వేగంతో పంచుకున్నారు. తమ కుటుంబానికి జాతీయ అవార్డులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ.. సరిగ్గా 36 ఏళ్ల క్రితం మా నాన్న నాగబాబు నిర్మాతగా రూపొందించిన తొలి చిత్రం 'రుద్రవీణ' మూడు జాతీయ అవార్డులు అందుకుంది. ఇప్పుడు నేను నిర్మాతగా పూర్తి బాధ్యతతో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' కూడా రెండు జాతీయ అవార్డులు గెలుచుకోవడం ఎంతో గర్వంగా, ఆనందంగా ఉంది. మా కుటుంబ చరిత్ర మరోసారి పునరావృతమైనట్టుగా అనిపిస్తోంది' అని తెలిపారు. నేషనల్ అవార్డు సాధించాలనే లక్ష్యంతో ఈ సినిమాను ప్రారంభించలేదని, అయితే దర్శకుడు యదు వంశీ చెప్పిన కథ విన్న తర్వాత ఈ చిత్రాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే బలమైన కోరిక తనలో కలిగిందని నిహారిక వెల్లడించారు. ఇప్పుడు ఆ కల నిజం కావడం ఎంతో సంతృప్తినిస్తోందని చెప్పారు. ఈ అరుదైన విజయంపై మెగాస్టార్ చిరంజీవి కూడా ఎంతో సంతోషం వ్యక్తం చేశారని, ఆయన నుంచి వచ్చిన ప్రశంసలు తనకు మరింత ప్రేరణనిచ్చాయని నిహారిక తెలిపారు.

# రాకా మూవీలో జాయిన్ అయిన నటి సిరి హన్మంతు

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో 'రాకా' సినిమా వస్తుందని తెలిసిందే. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ భాగమైనట్టు క్రేజీ అప్‌డేట్స్ వచ్చాయని తెలిసిందే. తాజాగా మరో ఆసక్తికర నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు నటి సిరి హన్మంతు 'రాకా' చిత్రంలో జాయిన్ అయింది. రీసెంట్‌గా జరిగిన ఓ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. సిరి హన్మంతు చివరగా సీతాపయనంలో మెరవగా.. త్వరలో విడుదల కానున్న ' చెన్నై లవ్ స్టోరీ' లో కూడా సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో ఇంతకీ సిరి హన్మంతు రాకా మూవీలో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ కొనసాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీని 2027 చివరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.



# వరుస సినిమాలతో మమతా బైజు బిజీ

'ప్రేమలు' సినిమాతో సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన అందాలభామ మమితాబైజు ఇప్పుడు అన్ని భాషల్నీ కవర్ చేస్తూ వరుసపెట్టి సినిమాలు చేస్తున్నది. అగ్రహీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి ఆమె నటించిన 'జననాయగన్' చిత్రం ఈ నెల 23న విడుదలకానున్న విషయం తెలిసిందే. ఇక సూర్యతో ఆమె నటించిన తెలుగు సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఆగస్ట్ 14న విడుదల కానున్నట్టు తెలుస్తున్నది. దర్శకుడు వెంకీ అట్లూరి ఫ్యామిలీ, లవ్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక మలయాళంలో మమితా నటించిన 'బెత్లెహం కుటుంబ యూనిట్' ఆగస్ట్ 21న రిలీజ్ కానుంది. ఫహాత్ ఫాజిల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మమత సరికొత్త పాత్రలో కనిపించనున్నది. నివిన్ పాలీ హీరో. ఈ విధంగా విజయ్, సూర్య, నివిన్‌పాలీ వంటి ప్రముఖ నటుల సినిమాల్లో నటిస్తూ అద్భుతమైన కెరీర్‌ని కొనసాగిస్తున్నది మమితా బైజు.



# ఎంజిఎంను సందర్శించిన వరంగల్ సీపీ

**మట్టెవాడ, జూలై 20 (పీపుల్స్ డైరీ):** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సోమవారం వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిని సందర్శించారు. సోమవారం ఉదయం ఎంజిఎంకు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ అవుట్ పోస్ట్ సందర్శించి సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, ఇక్కడికి వచ్చే మెడికో లీగల్ కేసులకు సంబంధించి ఏవిధమైన చర్యలు చేపడుతున్నారు. వీటికి సంబంధించి వివరాలను నమోదు చేసే రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన యువతకు చికిత్స అందిస్తున్న డి - అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రంలో మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువతను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు వైద్యులు అందిస్తున్న చికిత్స విధానాన్ని వైద్యులు పోలీస్ కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా ఎంజిఎం పరిసరాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ ఆసుపత్రికి సంబందించి ప్రధాన మార్గంతో పాటు, వాహన పార్కింగ్ ప్రదేశాలు, ముఖ్యమైన స్థలాల్లో సిసి కెమెరాల ఏర్పాటుపై సంబంధించిన అధికారులకు పలు సూచనలు చేయడంతో పాటు, ఎంజిఎంలో పార్కింగ్ ఏర్పాట్లు, హాస్పిటల్ సంబందించి ప్రధాన మార్గం నుండి ఆసుపత్రికి వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆసుపత్రి ప్రధాన ద్వారంలో ఆటోలను నిలపకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిపి



ట్రాఫిక్ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ఎంజిఎం సూపరింటెండెంట్ రాంకుమార్ రెడ్డి, ఆర్.ఎం.ఓ, ఏసీపీలు జితేందర్ రెడ్డి, సదయ్య, సత్యనారాయణ, ప్రశాంత్ రెడ్డి ఇన్స్ స్పెక్టర్లు కరుణాకర్, రాఘవేందర్, ఆర్.ఎస్.ఐలు పూర్ణచందర్ రెడ్డి, మనోజ్, నాగరాజు వున్నారు.



## ఎస్ఐఆర్ కేంద్రాలను పరిశీలించిన ఎర్రబెల్లి

**మట్టెవాడ, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని గిర్మాజీపేట ప్రాంతంలో కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన కేంద్రాలను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలలో జరుగుతున్న ఓటరు నమోదు, సవరణల ప్రక్రియను సమగ్రంగా పరిశీలించి అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సరిదిద్దే ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని అన్నారు. ఖచ్చితమైన ఓటరు జాబితా లేకుండా పారదర్శక ఎన్నికలు సాధ్యం కాదని, అందువల్ల ప్రతి అర్హుడైన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు చైతన్యంతో ముందుకు రావాలని, అభివృద్ధి దిశగా పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం ప్రజల ఓటు కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బిజెపి కార్యకర్తలు, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అడుప మహేష్ పార్థివ దేహానికి ఘన నివాళులు



**మట్టెవాడ, జూలై 20 (పీపుల్స్ డైరీ):** వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా సేవలందించిన ఏనుమాముల ఎన్.టిఆర్ నగర్ కు చెందిన అడుప మహేష్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందగా, ఆయన పార్థివ దేహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, హన్మకొండ డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఆయూబ్ తదితర కాంగ్రెస్ నాయకులతో కలిసి మహేష్ పార్థివ దేహానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్ల అడుప మహేష్ చూపిన అంకితభావం, నిబద్ధత, సోషల్ మీడియా విభాగంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన అకాల మరణం పార్టీకి తీరని లోటని అన్నారు.



## 25న అరుణోదయ నాగన్న సంతాప సభను జయప్రదం చేయండి!

### సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు

**మట్టెవాడ, జూలై 20 (పీపుల్స్ డైరీ):** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కామ్రేడ్ నాగన్న సంతాప సభను జయప్రదం చేయాలని సోమవారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ప్రజాసంఘాల నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు మాట్లాడుతూ కామ్రేడ్ నాగన్న సంతాప సభ ఈనెల 25న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు పి.వేణు అధ్యక్షత వహిస్తారని, ప్రముఖ కవి సతీష్ చందర్, సినీ నటులు ఆర్.నారాయణమూర్తి, సిపిఐ ఎంఎల్ న్యూడెమో క్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.వి చలపతిరావు, నాయకులు ఆవునూరి మధు, ప్రొఫెసర్ వినయ్ బాబు తదితరులు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విప్లవ సాంస్కృతిక సంఘాల కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. సభను జయప్రదం చేయాలని సాంస్కృతిక, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలను బాలరాజు కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, ఐఎఫ్.టియు నగర కార్యదర్శి బన్న నర్సింగం, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు గంద్రతి హరిబాబు, పిడిఎస్.యు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, మన్నే కరుణాకర్, బండి వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, ఇనుముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మక్కలు అమ్మి మూడు నెలలు..!

### ఒక్కరికైనా డబ్బులిచ్చారా..? - మాజీ సర్పంచ్ నైనకంటి ప్రభాకర్ రెడ్డి



**మొగుళ్ళపల్లి, జులై 20 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని రైతులు ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి మూడు నెలలు గడుస్తున్న ఒక్కరికైనా డబ్బులు ఇచ్చారా అంటూ.. మొగుళ్లపల్లి మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, రైతు నైనకంటి ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ. మొగుళ్లపల్లి మండలంలోని రైతులు మక్కలు అమ్మిన పైసలు ఇప్పటివరకు ఏ ఒక్క రైతుకు కూడా ఇవ్వలేదని, మా ప్రభుత్వం రైతు ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అంటూ నాయకులు గొప్పలు చెప్పుకోవడానికి తప్ప ఆచరణలో పెట్టడానికి ఏమాత్రం కనబడటం లేదని సూటిగా ప్రశ్నించారు. అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని. ఆరుగాలం కష్టించి ఎన్నో వ్యయ ప్రయాసాలను ఓర్చుకొని మార్క్ ఫెడ్ వారు పంపిణీ చేయవలసిన గన్ని సంచులను కూడా రైతులమే కొనుగోలు చేసుకున్నామని రవాణా చార్జీలను కూడా భరించుకొని, వాహనం ట్రక్ షీట్ రాయించుకోవడానికి పిఎసిఎస్ చుట్టూ మూడు రోజులు ప్రదక్షిణలు చేస్తే. ట్రక్ షీట్ ఇచ్చారని. తీరా గోదాముల వద్ద వాహనంతో సహా మరో మూడు నాలుగు రోజులు నిద్రాహారాలు మాని అనేక ఇబ్బందులను ఎదుర్కొని చివరకు దిగుమతి చేసుకోవడం జరిగిందని. మక్కలు అమ్మి ఇప్పటివరకు మూడు నెలలు గడిచిన ఏ ఒక్క రూపాయి రాకపోవడంతో పెట్టుబడి కోసం మళ్లీ అప్పులు చేసే పరిస్థితి రైతులకు దాపురించిందని ఎన్నిసార్లు నిరసన తెలియజేసిన ప్రభుత్వ వైఖరి మారడం లేదని ఇప్పటికైనా భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పందించి మక్కలు అమ్మిన డబ్బులను రైతులకు తక్షణమే అందించేందుకు చొరవ తీసుకోవాలని లేకుంటే మొగుళ్ళపల్లి మండలంలోని అన్ని గ్రామాల రైతులందరం కలిసి మండల కేంద్రంలోని పిఎసిఎస్ ముందు ధర్నా చేస్తామని రైతు నైనకంటి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

## గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదు

### నిర్లక్ష్యం పట్ల అసహనం వ్యక్తం చేసిన కమిషనర్ టి.వెంకన్న



**మట్టెవాడ, జూలై 20 (పీపుల్స్ డైరీ):** గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను హెచ్చరించారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ స్థానిక అంశాల సమస్యల పరిష్కారం కోసం నగర ప్రజలు అందచేసిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా పన్నుల, శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, డిఆర్ఎఫ్ విభాగాల గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కార తీరును కమిషనర్ సమీక్షించి మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ఆశించిన పురోగతి లేదని ప్రతి వారం స్వీకరించిన ఫిర్యాదులు ఖచ్చితంగా పరిష్కారం కావాలని, ఫిర్యాదులు పెండింగ్ లో ఉంటే సహించేది లేదని ఫిర్యాదు తీరును బట్టి అధికారులు ప్రజా క్షేత్రంలో పరిశీలించి వాస్తవాల నిర్ధారణ ఆధారంగా పరిష్కారం చూపాలని ఆయా విభాగాల లాగిన్ లలో ఫిర్యాదులు పేరుకుపోకుండా వెంటనే పరిష్కారం చూపాలని, శానిటరీ ఇన్స్పెక్టర్ లు, శానిటరీ సూపర్ వైజర్లకు శానిటేషన్ అంశాల పురోగతిపై ఇటీవల సూచనలు చేయడం జరిగిందని వాటిని తూ.చా తప్పకుండా పాటించి శానిటేషన్ నిర్వహణపై సమగ్ర అవగాహన ఏర్పరచుకొని అదే తీరును నిరంతరం కొనసాగించాలని కమిషనర్ సూచించారు. సోమవారం స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా ఇలా ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ 58, ఇంజనీరింగ్ 38, రెవిన్యూ 13, హెల్త్ అండ్ శానిటేషన్ 09, నీటి సరఫరా 09, హార్టికల్చర్ 01 కలిపి మొత్తం 128 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ రాజ్ కుమార్‌ఓ సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డిఎఫ్ఓ శంకర్ లింగం, ఇంచార్జి సిపి రవీందర్ రాడేకర్, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రెటరీ అనిల్ బాబు, హెచ్ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## “విప్రచిత్తా” క్రమంలో భద్రకాళి మాత

**మట్టెవాడ, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ మహా నగరంలోని శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు సోమవారంతో ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4గంటలకు నిత్యాహ్నికం పూర్తిచేసిన పిమ్మట అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి “విప్రచిత్తా” నిత్యా గాను షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని “మహావజ్రేశ్వరి” గాను అంకరించి పూజారాధనలు నిర్వహించారు. ఎంతో పుణ్యం చేసుకుంటే వచ్చింది ఈ మనుష్య జన్మ పరోపకారార్థమిదం శరీరం అని శాస్త్రం చెబుతోంది. పరులకు ఉపకారం చేయాలంటే మన దగ్గర జ్ఞానం, ఐశ్వర్యం, అధికారం లేదా వృత్తి నైపుణ్యం ఈ నాలుగింటిలో ఎదోకటి ప్రధానంగా కలిగియుండాలి. ఈ నాలుగు కూడా నిరంతర సాధన కఠోర పరిశ్రమ చేస్తేనే గాని సమకూరవు, ప్రారబ్ధవశమున అసురీ శక్తులు జీవుడిలో అలసత్వం బద్ధకం రూపంలో ప్రవేశించి సాధనా మార్గం నుండి ప్రక్కకు తప్పించి ఆతతాయిగా మార్చి మానవ జీవితాన్ని వ్యర్థపరుస్తాయి. మానవ జన్మ సార్థకం కావాలంటే సాధనా సంపత్తి కావాలి. జీవుడు సాధనలో నిమఘ్నం కావాలంటే ఈ అసురీ శక్తులు దూరం కావాలి. అందుకు జగన్మాత అనుగ్రహం కావాలి. విప్రచిత్తా అమ్మవారు బ్రాహ్మణుల బుద్ధియందు ప్రవేశించి బ్రాహ్మణు లు వేదోక్త తత్త్వజ్ఞానంతో కూడిన వేదవిహిత కర్మలను ఆచరించే విధంగా చేసి తద్వారా అగ్నిష్టోమాది శ్రోతయాగాలు జరుపుచూ తద్వారా సకల జనులు తరించే విధంగా చేస్తుం ది. అట్లాగే మహావజ్రేశ్వరీ మాత సాధకుడి సంకల్పాలను వజ్రసంకల్పంగా ధృఢతరం చేసి మనిషిని సాధనలో కృతకృత్యుణ్ణి చేసి అశ్మోద్ధరణ జరుపుతుంది. అపుడు జీవుడు తాను తరిస్తూ పదిమందిని తరింపజేస్తాడు. ఈ విధంగా లోకకళ్యాణం జరుగుతుంది. జగన్మాత ఆరాధన వల్ల అని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. అమ్మవారి దర్శనానికి భక్తులు సాంప్రదాయమైన దుస్తులతో రావాలని, దేవాలయం, దేవాలయ ప్రాంగణంలో యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్ వీడియోలు, రీల్స్ చేయుట నిషేధించడం జరిగిందని అందుకు భక్తులు సహకరించాలని రామల సునీత కోరారు.

## విద్యార్థులకుప్రాథమిక పాఠశాలలే బలమైన పునాది

### జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి

**గోవిందరావుపేట, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** ప్రతి విద్యార్థికి ప్రాథమిక పాఠశాలలే ప్రధాన పునాది అని ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి అన్నారు,జూలై 20వ తేదీ నుండి జిల్లాలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు రెండు దశలుగా శిక్షణ తరగతులు ప్రారంభం కాగా మొదటి రోజు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.సిద్ధార్థరెడ్డి గోవిందరావుపేట మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల గోవిందరావుపేట మండల కేంద్రంలోని శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే ప్రాథమిక విద్య బోధించే ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని అన్నారు. కృత్యాధార, ఆటపాటలతో జాయ్ ఫుల్ లర్నింగ్ ద్వారా విద్యార్థులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆకర్షించాలని, స్నేహపూర్వక వాతావరణంలో విద్యాబోధన ద్వారా విద్యార్థుల మనసులో చెరగని ముద్ర వేసుకునే ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులదే అన్నారు. ప్రాథమిక పాఠశాలల



ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయుటకు బలమైన పునాది వేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దివాకర్, శిక్షణ శిబిరం ఇంచార్జ్. గోవిందరావుపేట బాలికల పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు డి .వెంకటేశ్వర్లు, మరియు రిసోర్స్ పర్సన్లు,ఏ వెంకటేష్,టి కిషోర్, జి మాధవి లత, ఎస్ రమేష్ బాబు ఎంఆర్‌సి సిబ్బంది బి.విష్ణు,.ఎల్ రజిత మరియు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు,

## ఆకాశంలో రంగుల హరివిల్లు...!

**గణపురం, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి గ్రామ శివారులో తేలికపాటి వర్షం అనంతరం ఆకాశంలో ఏడు రంగులతో మెరిసిన ఇంద్రధనస్సు గ్రామస్థులను విశేషంగా ఆకట్టుకుంది. మేఘాలు క్రమంగా తొలగిపోతుండగా ఆకాశాన్ని అలంకరించిన హరివిల్లు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేసింది. కొద్దిసేపు కనిపించిన ఈ అద్భుత దృశ్యాన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు. పలువురు తమ మొబైల్ ఫోన్లలో ఆ అందాలను చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. వర్షం అనంతరం వెలిసిన రంగుల హరివిల్లు లక్ష్మారెడ్డిపల్లి పరిసరాలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చి, ప్రకృతి అందాలను ఆస్వాదించేలా చేసింది.



పీపుల్స్ డైరీ
వరంగల్
మంగళవారం, 21 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 133




## నల్లబెల్లి కేజీబీవీలో ఏకరూప దస్తుల పంపిణీ

**నల్లబెల్లి, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** నల్లబెల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీవీబీ) నల్లబెల్లి హాస్టల్లో విద్యార్థినులకు ఉచిత ఏకరూప దస్తుల (యూనిఫామ్స్) పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో అభ్యసిస్తున్న విద్యార్థినులకు ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున మొత్తం 596 జతల ఏకరూప దస్తులను ఆతిథ్య ప్రముఖుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేక అధికారిణి (ఇ/చా) సునీత మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యా సదుపాయాలు మరియు సంక్షేమ పథకాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకొని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ యాకూబ్, ఎూూ కొలగాని రవి, ఓదెల కవిత, రవి, పాఠశాల ఉపాధ్యాయినులు, సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలు వేయాలి




**నర్సంపేట, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** వరి పంటా బదులు ఆరుతడి పంటలు వేయాలి అని రైతులకు అవగాహన కార్యక్రమం చెంద్రయ్యపల్లి, లక్నేపల్లి, ముత్యాలమ్మ తండ మరియు ద్వారకాపేటలో నిర్వహించారు. ద్వారకాపేట ప్రోగ్రామ్ వ్యవసాయ సహాయ సంచాలకులు నర్సంపేట శ్రీనివాస్ మాట్లాడారు. లో ఎల్‌నినో ప్రభావం వల్లన వర్షాలు సరిగ్గా పడక పోవటం వలన వరి నాటు వేస్తే నీళ్ళు సరిపోక సిబ్బంది పడవలసి వస్తుంది. రైతులు ప్రత్యమ్నయంగా అపరాలు జొన్న ఈతర తగ్గువ నీరు వాసరం ఉన్న పంటలు వేసుకోవాలి పాకాల ఆయకట్టు పరిధిలో నీరు నిలవ లేనందున సంగం కాల్వ క్రింద వరి పంట వేయకూడదు. ఈ ప్రోగ్రాంలో మున్సిపాలిటీ నర్సంపేట వైస్ చైర్మన్ గంధం నరేందర్ మాట్లాడుతు రైతులు పరిస్తుతులకు అనుకులంగా పంటలు వేయాలి అని నీరు తక్కువ అవసరం ఉన్న పంటలు వేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో లక్నెపల్లి సర్పంచ్ ఐలోని రజిత, చెంద్రయ్యపల్లి సర్పంచ్ అజ్మీరా వస్రం, ముత్యాలమ్మ తండా సర్పంచ్ బానోతు సురేష్ మండల వ్యవసాయ అధికారి కృష్ణకుమార్ వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్కర్, సంధ్య, సింధు అబిద్ హుస్సేన్ ద్వారకాపేట్, సర్వపూర్, చెంద్రాయపల్లి, లక్నేపల్లి ముత్యాలమ్మ తండా రైతులు పాల్గొన్నారు


## ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి చెక్కు అందజేసి మంత్రి పొన్నం




**నర్సంపేట, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపో డ్రైవర్ కీర్తి శేషులు దివంగత కోల శంకర్ గౌడ్ కుటుంబానికి సోమవారం రోజు హైదరాబాద్ కళాభవన్ వేదికగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ , ఆర్టీసీ ఎం డి నాగిరెడ్డి, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు అన్ని యూనియన్ల నాయకుల సమక్షంలో శంకర్ గౌడ్ భార్య కోలా హేమలతకి 90,85,500 తొంబై లక్షల 85 వేల 500 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రీజనల్ మేనేజర్ ఎస్ భవాని ప్రసాద్, డిప్యూటీ ఆర్ ఎం కిషన్ రావు, పిఓ వీరన్న , నర్సంపేట డిపో మేనేజర్ ఎం సరస్వతి, శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కుల మతాలకు అతీతంగా సభ్యత్వం తీసుకోవాలి

### రాష్ట్ర ప్రచార కార్యదర్శి మల్లయ్య



**చిట్యాల, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** టేకుమట్ల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల కన్వీనర్ మారేపల్లి కొమురయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన సంఘం సమావేశానికి మరియు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య విచ్చేసి మాట్లాడుతూ అంబేద్కర్ యువజన సంఘం సభ్యత్వాన్ని కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరు తీసుకోవాలని పిలుపునిచ్చారు. భారత రత్న ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశ ప్రజలకు భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులు రిజర్వేషన్లు ఓటు హక్కుతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించారని అందు కోసం కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు హక్కులను రిజర్వేషన్లతో పాటు భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడని కుల మతాలకు అతీతంగా అందరికీ హక్కులు రిజర్వేషన్ల తో పాటు ఓటు హక్కు కల్పించారని భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. అందరు స్వేచ్ఛ సమానత్వంతో జీవించడం కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని తెలిపారు. దళితులను బానిసత్వం నుండి విముక్తులను చెసిన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. ఆ మహనీయుని ఆశయాలను సిద్ధాంతాలను గ్రామస్థాయి నుంచి కొనసాగించాలని అంబేద్కర్ యువజన సంఘం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిందని గ్రామస్థాయి నుండి ఆవిర్భావ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా జరపాలని అలాగే జిల్లా రాష్ట్రంలో జరిగే ఉత్సవాలకు అధిక సంఖ్యలో అంబేద్కర్ వాదులు మేధావులు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం 50వ ఆవిర్భావ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జె బి రాజు అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అవిలయ్య రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కుల మతాలకు అతీతంగా అందరికి సభ్యత్వాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం భూపాలపల్లి నియోజక వర్గ కన్వీనర్ అరకొండ రాజయ్య చిట్యాల మండల అధ్యక్షులు జన్నే యుగేందర్ టేకుమట్ల మండల ఉపాధ్యక్షులు పారానంది రాములు టౌన్ మాజీ అధ్యక్షులు మచ్చ ప్రభాకర్ నాయకులు పాల కుమార్ బొడ్డు రాములు అరకొండ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలులో కాంగ్రెస్ విఫలం






**ఆత్మకూర్, జులై 20 (పీపుల్స్ డైరీ) :** ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఉమ్మడి వరంగల్ జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు మంద అయిలయ్య విమర్శించారు. బీజేపీ ఆత్మకూర్ మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు మంద అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల కంటే రాజకీయాలపైనే దృష్టి సారించిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఆదరణ చూపుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. మండలం లోని ప్రతి బూత్‌ను బలోపేతం చేసి పార్టీని గ్రామ స్థాయిలో మరింత విస్తరించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంస్థాగత బలోపేతం, బూత్ కమిటీల పటిష్టీకరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ పీ జయంత్ లాల్, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ వెంకన్న, మాజీ మండల అధ్యక్షుడు ఇర్సుడ్ల సదానందం, జిల్లా కన్వీనర్ శ్రావణ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి భయ్యా పైడి రవ్వ శివప్రసాద్, బీజేవైఎం అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు వేములపల్లి శ్రీలతతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటిచాలి

### జిల్లా ఆరోగ్య ఉప వైద్యాధికారి సుధీర్



**గోవిందరావుపేట, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సుధీర్ అన్నారు, సోమవారం పసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఉపకేంద్రాలను ఆయన సందర్శించడం జరిగింది, అంతేకాకుండా తాడ్వాయి మండల పరిధికో డిశాల గోవిందరావుపేట మరియు పసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా ఉప వైద్యా డాక్టర్ సుదీర్ సందర్శించారు, వర్షాకాలంలో వచ్చే వ్యాధులు మలేరియా డెంగ్యూ, అతి సార లాంటి వ్యాధుల పట్ల నిరంతర నిఘా ఉండాలని, క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు నిరంతరం ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి వారికి మలేరియా ఆర్డిటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు వర్షాకాలం ఇంటింటి సర్వే నిర్వహించి నప్పుడు, ఇంటి యజమానులకు నీటి నిల్వలు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోక పోవడం వలన దోమల వ్యాప్తి జరుగుతుందని, ఇంటి యజమానులకు అవగాహన కలిగించాలని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల చికిత్స మందులు ఆరోగ్య కేంద్రాలలో నిల్వ ఉండేటట్లు చూసుకోవాలని ఫార్మసీ ఆఫీసర్లకు తెలియజేశారు. లేనియెడల జిల్లా కార్యాలయాలకు ఇండెంట్ పెట్టాలని తెలిపారు. ప్రతి సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గర్భిణీ స్త్రీల పరీక్షల నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని ఆరోగ్య సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాత సంరక్షణ మరియు పోషకాహార ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీకాంత్ మాస్ మీడియా అధికారి సంపత్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ మౌనిక డాక్టర్ సుచిత సబ్ యూనిట్ ఆఫీసర్ భూపాల్ రెడ్డి, పిహెచ్ఎన్ లక్ష్మి సూపర్వైజర్,శ్యామల ఫార్మసీ, శారద స్టాఫ్ నర్స్ సంధ్య,ల్యాబ్ టెక్నీషియన్ మొదలగువారు పాల్గొన్నారు.

# ప్రతినెల 5వ తేదీనే కార్మికుల అకౌంట్లో జీతాలు జమ చేయాలి

### కలెక్టర్ సత్య శారదకు సివిల్ సప్లై కార్మికులు వినతి







**నర్సంపేట, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై హమాలీ కార్మికుల యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు దేవన బోయిన రాంబాబు ఆధ్వర్యంలో అమాలి కార్మికుల వేతనాలు ప్రతినెల సమయపాలన పాటిస్తూ చెల్లించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించగా రాష్ట్ర అధ్యక్షులు, నాయకులు పాల్గొనగా వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం గేటు ముందట ధర్నా చేసి తదుపరి కలెక్టర్ శారదా కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ పాల్గొని మాట్లాడుతూ వరంగల్ జిల్లా లో అన్ని సివిల్ సప్లై గోదాములలో హమాలి కార్మికులు నెల రోజులు అంటూ మూడు నెలలుగా పని చేయగా జీతాల జాప్యంతో కేంద్రం 60 శాతం రాష్ట్రం 40% అంటూ విభజన రూపంలో నెలసరి జీతాలు మరో నెల వచ్చే వరకు కూడా జీతాలు ఆలస్యంగా కుటుంబ ఆర్థిక ఇబ్బందులకు అనేక రకాలుగా కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు మరియు కేంద్రం మూడు నెలలుగా బియ్యం పంపిణీ చేయాలని తెలపడం కార్మికుడి కుటుంబ ఆర్థికానికి కుంటుపడే పరిస్థితి వల్ల ప్రతినెల ఐదో తారీకు కార్మికుల అకౌంట్లో జీతాలు జమ చేయాలని డిమాండ్ చేశారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వారు రాష్ట్ర అధ్యక్షులు గుంపల్లి మునీశ్వర్ జలగం బిక్షపతి ముద్ర బోయిన మహేందర్, కందిక చెన్నకేశవులు, గోవర్ధన్ మియాపురం దేవనబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పవర్ స్ప్రే పంపుల పంపిణీ



**కేసముద్రం, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజినల్ ఆఫీస్ వరంగల్ వారి ఆధ్వర్యంలో మరియు యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ ట్రస్ట్ సహాయ సహకారాలతో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) ని దృష్టిలో ఉంచుకొని కేసముద్రంలో 300ల రైతులకు ఉచితంగా ఫెర్టిలైజర్ పవర్ స్ప్రే పంపుల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించడానికి మరియు రైతుల శ్రమను తగ్గించడానికి బ్యాంక్ చేపట్టిన ఈ సత్కార్యం స్థానిక రైతుల్లో హర్షోల్లాసం నింపింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ విచ్చేసారు. అలాగే యూనియన్ బ్యాంక్ వరంగల్ రీజినల్ మేనేజర్ జి. కమలాకర్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. జాటోత్ హుస్సేన్ నాయక్ ప్రసంగిస్తూ యూనియన్ బ్యాంక్ సేవలను కొనియాడారు. హుస్సేన్ నాయక్‌ని సత్కరించి, రీజనల్ హెడ్ జీ. కమలాకర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ద్వారా చేసే ఎన్నో సామాజిక సేవల గురించి చెప్పారు. అన్ని గ్రామాల సర్పంచులు, సర్కారు అధికారులకు యూనియన్ బ్యాంక్‌లో సర్కారు ఖాతాలు తెరిచి బ్యాంకు నుండి సేవలు అందుకోమని సెలవిచ్చారు. తదుపరి, కమలాకర్‌ని హుస్సేన్ నాయక్, సత్కరించారు. రీజనల్ ఆఫీస్ నుండి, బ్రాంచిల నుండి యూనియన్ బ్యాంక్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## నాసా ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్ పోటీలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

**హనుమకొండ, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండలోని నక్కలగుట్టలో గల శ్రీ చైతన్య పాఠశాల-4 విద్యార్థిని సి.హెచ్.హరిణి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. రోడ్డు మ్యాప్ టు స్పేస్ హార్ట్ కాంటెస్ట్ విభాగంలో 10వ తరగతి విద్యార్థిని సి.హెచ్.హరిని అంతర్జాతీయ స్థాయిలో బహుమతి సాధించింది. మరియు ఆశ్రయ తార స్పేస్ కాలనీకి శాంతికరణ్, శ్రీ సాయి ఆదర్శ్ గ్రూపు విద్యార్థులు జాతీయస్థాయిలో మూడో బహుమతి సాధించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోశీటో, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లశీపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, ఏ.జి.ఎం.మనోహర్, కోఆర్డినేటర్ శివ కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ సీమ, పాఠశాల ఇన్చార్జి నాగార్జున్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

### తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్

**నల్లబెల్లి జూలై 20 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని సబ్ పోస్ట్ ఆఫీస్ నుండి రిజిస్టర్ పోస్ట్ ద్వారా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కి తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక మరియు ఎంఆర్పీఎస్ (వీ౯ూా) నాయకులు విజ్ఞాపన పత్రాన్ని పంపడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి, సామాజిక ఉద్యమ నేత బట్టు సాంబయ్య మరియు ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులు, దళిత రత్న అవార్డు గ్రహీత పరికిరత్నం మాదిగ మాట్లాడుతూ...తెలంగాణ మలిదశ ఉద్యమంలో భాగంగా 2009 డిసెంబర్ 28, 29, 30 తేదీలలో మూడు రోజుల పాటు నల్లబెల్లి బస్టాండ్ సెంటర్లో బొట్ల పవన్, బట్టు సాంబయ్యలు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని గుర్తుచేశారు. నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని, "నిధులు, నీళ్లు, నియామకాలు" సాధించుకోవాలని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని అనేక రకాల నిరసన కార్యక్రమాలు, ఉద్యమాలు నిర్వ హించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రకారం ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించి, సంక్షేమ పథకాలను తక్షణమే వర్తింపజేసి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.





## వెంటనే ఫిజిక్స్ టీచర్‌ను నియమించాలి

**కరకగూడెం, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం అనంతారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గత రెండేళ్లుగా ఫిజిక్స్ సబ్జెక్టుకు శాశ్వత ఉపాధ్యాయుడు లేకపోవడంతో పదో తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిజిక్స్ సబ్జెక్టుకు కేటాయించబడిన ఉపాధ్యాయురాలు రెండేళ్ల క్రితం డిప్యూటేషన్‌పై పాల్వంచలోని జడ్పీహెచ్ఎస్ కేటీపీఎస్ పాఠశాలకు వెళ్లినప్పటి నుంచి అనంతారం పాఠశాలలో ఆ పోస్టు ఖాళీగానే ఉందని విద్యార్థులు తెలిపారు. దీంతో ఫిజిక్స్ సబ్జెక్టును బోధించే ఉపాధ్యాయుడు లేక సుమారు 50 మంది విద్యార్థులు విద్యాభ్యాసంలో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతిలో ఫిజిక్స్ అత్యంత కీలకమైన సబ్జెక్టు అయినప్పటికీ, గత రెండేళ్లుగా ఎవరూ సక్రమంగా బోధించకపోవడంతో పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించగలమా అనే ఆందోళన నెలకొందని విద్యార్థులు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే అనంతారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు ఫిజిక్స్ ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని, జిల్లా విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు విద్యా సామగ్రి పంపిణీ



**కరకగూడెం, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చిలకలగుంపు మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొత్తూరు పాఠశాలల విద్యార్థులకు ఖమ్మం జిల్లాకు చెందిన దాతలు ఆయుర్వేద వైద్యులు డా. కాళహస్తి వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఐ (అమెరికా) వి.వి. యేసు రెడ్డి, కె. సూర్యనారాయణ, బి. బావసింగ్ సంయుక్తంగా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఒక సౌండ్ బాక్స్‌ను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మంజుల, అనంతారం కాంప్లెక్స్ హెచ్ఎం సీహెచ్. వసంతరావు, చిలకలగుంపు, కొత్తూరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ సీఆర్పీ విష్ణు, వై. సర్వేశ్వరరావు, కె. సూర్యనారాయణ, బి. బావసింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మండల విద్యాశాఖ అధికారి మంజుల మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.

## భార్యపై భర్త కత్తితో దాడి





**ఏన్కూరు జూలై 20 (పీపుల్స్ డైరీ) :** భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన ఏన్కూరు పోలీస్ స్టేషన్లో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సంధ్య తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. డయల్-112 ద్వారా వచ్చిన ఫిర్యాదును ఎన్కూర్ పోలీస్ స్టేషన్ బ్లూ కోట్ కానిస్టేబుల్ వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేయగా, భూక్య రాంబాబు తన భార్య రజినిని అసభ్య పదజాలంతో దూషిస్తూ, చంపేస్తానని బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఎన్కూర్ ఎస్బిఐ బ్యాంక్ వద్ద ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోలీసులకు తెలియజేశారు. వెంటనే బ్లూ కోట్ కానిస్టేబుల్ బాధితురాలు రజినిని ఫిర్యాదు చేయవలసిందిగా కోరి ఆమెను వెంట తీసుకుని పోలీస్ స్టేషన్ కు రాగ ఆమె కంప్లైంట్ రాస్తుండగా రాంబాబు ముందస్తుగానే తన భార్యను హత్య చేయాలనే ఉద్దేశంతో కత్తిని వెంట తీసుకుని వచ్చి, రజిని పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే అకస్మాత్తుగా పోలీస్ స్టేషన్ ఆవరణలోకి పరిగెత్తుకుంటూ వచ్చి, కత్తితో ఆమెపై దాడి చేసి హత్య చేయడానికి ప్రయత్నించాడు. ఈ దాడిలో రజిని భుజంపై కత్తి గాయం అయ్యింది. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది వెంటనే అప్రమత్తమై నిందితుడిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు, గాయపడిన బాధితురాలికి వైద్య చికిత్స అందించబడిందనీ, నిందితుడిని అదుపులోకి తీసుకొని చట్టపరమైన చర్యలు కొనసాగిస్తున్నామనీ ఎస్సై సంధ్య తెలిపారు.

## ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం




**గోవిందరావుపేట, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** ప్రతి ఇంటికి సీసీ కెమెరా అమర్చుకున్నట్లయితే ఎంతో రక్షణగా ఉంటుందని ఒక సీసీ కెమెరా 100 పోలీసు సిబ్బందితోసమానమని పసరఎస్సై తాజో ద్దీన్ అన్నారు, అంతేకాకుండా 'నేను సైతం' కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో పోలీసుల పిలుపు నిచ్చారు. డిజిపి ఉత్తర్వుల మేరకు ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకేన్ ఐపిఎస్ సూచనలతో, ములుగు డీఎస్పీ రవీందర్ పర్యవేక్షణలో, పస్రా సీఐ దయాకర్ ఎస్ ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తు"నేను సైతం" కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా డంపెల్లిగూడెం గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సీతారాం, వార్డు సభ్యుల సహకారంతో గ్రామంలో 9 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే పస్రాకు చెందిన సంపత్ రెడ్డి తన నివాసంలో 3 సీసీ కెమెరాలు, చల్వాయి గ్రామానికి చెందిన దుకాణదారుడు నర్సయ్య తన షాపు వద్ద 3 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, నేరాల నియంత్రణ, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణలో సీసీ కెమెరాలు అత్యంత కీలకమని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అవుతుంది అన్నారు.

# సాగునీరు లేక బీడువారుతున్న భూములు

**మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్**
**చిలుకూరు మండలంలో పంట పొలాల పరిశీలన**
**రైతులు, కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్న నేత**
**ప్రభుత్వానిది సమీక్షల పేరుతో కాలయాపన**
**తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలి**



**కోదాడ, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** సాగునీటి కొరత కారణంగా పచ్చని పంటలతో కళకళలాడాల్సిన వ్యవసాయ భూములు బీడు భూములుగా మారుతుండటం అత్యంత బాధాకరమని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. చిలుకూరు మండల కేంద్రంలో ఆయన సోమవారం పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల్లో పనిచేస్తున్న రైతు కూలీలతో మాట్లాడి, వర్షాభావ పరిస్థితుల వల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం వల్ల తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు ప్రభుత్వాన్ని ముందుగానే హెచ్చరించినప్పటికీ, పాలకులు ఎలాంటి ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదని తీవ్రంగా



విమర్శించారు. ఇప్పటికే నారు పోసి నీటి కోసం ఎదురు చూస్తున్న రైతులకు సాగునీరు అందిస్తారా లేదా అనే విషయంపై స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని మండిపడ్డారు. భూగర్భ జలాలు గణనీయంగా పడిపోవడంతో బోర్ల కింద రైతులు కేవలం ఒకటి, రెండు ఎకరాలకే పరిమితం కావాల్సి వస్తోందన్నారు. రైతులకు సాగు భారమవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని వేలాది మంది వ్యవసాయ కూలీలకు ఉపాధి దొరకడం లేదని, వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు బాగా పండినప్పుడు తమ ఘనతగా చెప్పుకునే ప్రభుత్వం, కరువు ముంచుకొస్తున్నప్పుడు సమీక్షల పేరుతో కాలక్షేపం చేస్తోందని ఆరోపించారు. గత రెండున్నర సంవత్సరాలుగా వ్యవసాయ రంగంపై ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, శాస్త్రీయంగా పరిస్థితులను అంచనా వేసి సాగునీటి లభ్యతపై రైతులకు స్పష్టమైన ప్రకటన చేయాలని, యుద్ధప్రాతిపదికన కరువు నివారణ చర్యలు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు.

# సిపిఎస్ రద్దు కాకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం

## జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్



**చిట్యాల, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** పిఆర్టియు మండల శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాస్ సూదం సాంబమూర్తి ఆధ్వర్యంలో ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిఆర్టియు టిఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లగరిగ గోపాలపురం జడల్పేట నైనపాక భీష్మనగర్ జూకల్ పాఠశాలలతో పాటు చిట్యాల మోడల్ స్కూల్‌లోని ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు నిర్వహించారు. అనంతరం కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయడం సరికాదన్నారు. సెప్టెంబర్ 1వ తేదీలోపు సిపిఎస్ ను పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానం ఓపిఎస్ ను అమలు చేయాలని పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని అలాగే పెండింగ్‌లో ఉన్న పిఆర్సి రిపోర్టును తక్షణమే తెప్పించుకొని 50% ఫిట్మెంట్ తో నూతన పిఆర్సి ను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులను తక్షణమే వినియంలోకి తీసుకురావాలని అదేవిధంగా మోడల్ స్కూల్ మరియు గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు కేజీబీవీ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా హెల్త్ కార్డులను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా సర్వ శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఈ హెల్త్ కార్డులను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోని పక్షంలో సెప్టెంబర్ 1న రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటించి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరగాని కృష్ణ వాసంతి జిల్లా ఉపాధ్యక్షులు నూకల లింగయ్య దొడ్డ శ్రీలత చిలకామారి సదానందం పల్లవి రెడ్డి బాధ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సాగునీరు, యూరియా కొరతపై మాజీ ఎమ్మెల్యే తీవ్ర ఆందోళన

**నేలమర్రి గ్రామంలో ఎండిపోతున్న పంట పొలాల పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్**



**మునగాల, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని నేలమర్రి గ్రామంలో సాగునీటి కొరతతో ఎండిపోతున్న పంట పొలాలను కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ సందర్శించి, రైతులు, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు చేయకపోవడం వల్లే పచ్చని పొలాలు బీడువారే పరిస్థితి వచ్చిందన్నారు. సాగునీటిపై స్పష్టత లేక, భూగర్భ జలాలు తగ్గి బోర్లలో నీరు రాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో జర్నలిస్టులు సాగునీటి సమస్యపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా, ప్రతిపక్ష నేతలు రక్తం చల్లితే పంటలు పండుతాయా అంటూ అవహేళనగా మాట్లాడటం రైతుల సమస్యలను తేలికగా తీసుకోవడమేనని విమర్శించారు. పంటలు పండితే తమ ఘనతగా చెప్పుకునే ప్రభుత్వం, కరువు వస్తే రాజకీయ విమర్శలతో కాలక్షేపం చేస్తూ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. యాప్, సర్వర్ సమస్యల వల్ల సకాలంలో యూరియా అందక రైతులు క్యూలైన్లలో ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే సాగునీటి లభ్యతపై స్పష్టత ఇవ్వాలని, యూరియా నిల్వలు పెంచాలని, ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కూలీలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## రోప్ స్కిప్పింగ్ జిల్లా జనరల్ సెక్రటరీగా శ్రీనాథ్



**ఆత్మకూర్, జులై 20 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణలో రోప్ స్కిప్పింగ్ క్రీడను గ్రామీణ స్థాయి నుంచి మరింత విస్తరింపజేయడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడం లక్ష్యంగా తెలంగాణ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ జిల్లాల వారీగా కొత్త బాధ్యులను నియమించింది. ఈ సందర్భంగా కూకట్‌పల్లిలోని రిషి ఎమ్.ఎస్. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ విమెన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓరియంటేషన్ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా రోప్ స్కిప్పింగ్ జనరల్ సెక్రటరీగా మండలంలోని పెంచికలపేటకు చెందిన ముదిగిరి శ్రీనాథ్‌ను నియమిస్తూ అఫిలియేషన్ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సర్టిఫికెట్‌ను ఐఆర్ఎస్ఎఫ్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ షగుఫ్తా అంజుమ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మామిడి శ్రీధర్, రాష్ట్ర ఖజాంచి దాడి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయిని శ్రీనివాస్ గౌడ్ సంయుక్తంగా శ్రీనాథ్‌కు అందజేసి అభినందనలు తెలిపారు.

# “రక్షణ రంగ రథసారథి” పుస్తకావిష్కరణ





**నల్లబెల్లి, జూలై 20 (పీపుల్స్ డైరీ) :** అపోలో మైక్రో సిస్టమ్స్ అధినేత మరియు మేనేజింగ్ డైరెక్టర్ బద్దం కరుణాకర్ రెడ్డి జీవిత చరిత్ర “రక్షణ రంగ రథసారథి” పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆయన జన్మదినోత్సవం సందర్భంగా సంస్థ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. మార్కెటింగ్ ప్రెసిడెంట్ అల్లూరి వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధినేత స్వయంగా తన చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించి, కేక్ కటింగ్ చేశారు. పూలబొకేలు, శాలువాలతో సన్మానాలు, మహిళల మంగళహారతుల మధ్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి జన్మదిన ఉత్సవాలను పండుగలా జరుపుకున్నారు. సంస్థ యాజమాన్యం, డైరెక్టర్లు, ఉన్నతాధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అధినేత కుమారులు విచ్చేశారు. సంస్థలోనే ప్రాతినిధ్యం వహిస్తూ తండ్రి బాట లో, తండ్రి చూపిన మార్గంలో నడుస్తూ, సంస్థ భుజస్కంధాలపై బాధ్యతలు స్వీకరిస్తూ ఇటీవలే నూతన బాధ్యతలు చేపట్టిన బద్దం కనిష్క రెడ్డి, బద్దం చాణిక్య రెడ్డి ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. తండ్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ డైరెక్టర్ సాయి కుమార్, సీజీఎం పోతురాజు, టెక్నికల్ డైరెక్టర్ ప్రసాద్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సుదర్శన్, జనరల్ మేనేజర్లు విజయేందర్, ధీరజ్, భూషణ్ దేశ్పాండే, రామకోటి, శ్రీశైలం, మార్కెటింగ్ మేనేజర్లు రాఘవేంద్రరాజు, రాకేష్, సాయి నికిత్, ఆదిత్య, సేల్స్ కో-ఆర్డినేటర్లు సౌమ్య, కీర్తన, అనూష, బిందు, సంస్థలో ఏ కార్యక్రమం జరిగినా ముందుండి వాటి విజయానికి తోడ్పాటు అందించే కవిత, పద్మశ్రీ, హెచ్ఆర్ విభాగం ఇందుప్రియ, జోష్ణ, టీం లీడర్లు, ఇంజనీర్లు, డిజైనర్లు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com